Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 212 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 22 ఆగష్టు 2023 | మంగళవారం | పేజీలు : 4

### 8 వేల కోట్లతో 3 విపత్తు నిర్వహణ ప్రణాళికలు

న్యూఢిల్లీ : విపత్తు నిర్వహణ ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించనుంది. ఇందుకోసం రూ.8 వేల కోట్లపైగా విలువైన మూడు పథకాలను ప్రకటించింది. దీనిలో భాగంగా అన్ని రాష్ట్రాల్లో అగ్నిమాపక సేవల ఆధునికీకరణకు రూ.5 వేల కోట్లు ఇవ్వనుంది. హైదరాబాద్, ముంబై, పుణె, కోల్‌కతా, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో వరదముప్పు నివారణకు రూ.2,500 కోట్లు ఇవ్వనుంది. 17 రాష్ట్రాల్లో కొండచరియలు విరిగిపడకుండా నిరోధించే కార్యక్రమానికి రూ.825 కోట్లు కేటాయించనుంది. అన్ని రాష్ట్రాలు/యూటీల విపత్తు నిర్వహణ మంత్రుల సమావేశంలో కేంద్ర మంత్రి అమిత్ షా ఈ వివరాలను వెల్లడించారు.

# బిఆర్ఎస్‌లో అందరికీ భవిష్యత్ ఉంటుంది

## ప్రతి ఒక్కరికి అవకాశం వస్తుంది




హైదరాబాద్: టికెట్లు రానంత మాత్రాన చిన్నబుచ్చుకోవాల్సిన అవసరం లేదని, అనవసర హడావుడి చేసి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని భారాస అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ పార్టీ నేతలకు హితవు పలికారు.

భారాస సముద్రం లాంటిదని, పెద్ద ఎత్తున ప్రతి ఒక్కరికీ అవకాశాలుంటాయని చెప్పారు. మీరు కూడా పార్టీలోనే ఉండాలి. " రాజకీయ జీవితమంటే ఎమ్మెల్యేగా పని చేయడమే కాదు. ఎమ్మెల్సీ, రాజ్యసభ ఎంపీ.. ఇలా అనేక అవకాశాలు ఉంటాయి. చాలా మంది జిల్లా పరిషత్ ఛైర్మన్లు అయ్యే అవకాశం కూడా ఉంటుంది. గతంలో అలా చేశాం కూడా. ఈ ఎన్నికల్లోనూ అఖండ విజయం సాధించి తెలంగాణను మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాం" అని కేసీఆర్ అన్నారు. ఎన్నికలంటే ఇతర పార్టీలకు పొలిటికల్ గేమ్ అని, భారాసకు మాత్రం ఓ టాస్క్ అని కేసీఆర్ తెలిపారు. ఎన్నికలను ఒక పవిత్రమైన యజ్ఞంలా ముందుకు తీసుకెళ్తామన్నారు. పూర్తి స్థాయిలో చర్చించి, సంపూర్ణ అవగాహనతోనే అభ్యర్థుల జాబితాను ప్రకటించామన్నారు. నర్సాపూర్, జనగామ, నాంపల్లి, గోషామహల్ స్థానాలు పెండింగ్‌లో ఉన్నాయని, రాబోయే నాలుగు రోజుల్లో కమిటీ మరోసారి భేటీ అయ్యి, ఈ స్థానాల్లోనూ అభ్యర్థులను వెల్లడిస్తామన్నారు.

సీట్లు ప్రకటించిన అభ్యర్థులు పూర్తిగా ప్రజల్లో ఉన్నందునే గుర్తింపు ఇచ్చి మరోసారి టికెట్లు కేటాయించామన్నారు. టికెట్లు పొందిన వారందరికీ అభినందనలు తెలుపుతూ.. అద్భుత విజయం సాధించాలని ఆకాంక్షించారు.

**16న భారాస మేనిఫెస్టో...** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 95 నుంచి 105 స్థానాల్లో భారాస విజయం సాధిస్తుందని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పాతరంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని మొత్తం 29 స్థానాల్లో భారాస, మజ్లిస్ గెలుస్తాయన్నారు. కేవలం ఎమ్మెల్యేలు మాత్రమే కాకుండా మొత్తం 17 ఎంపీ స్థానాల్లోనూ విజయం సాధిస్తామని చెప్పారు. మజ్లిస్, భారాస పార్టీల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉందని, భవిష్యత్‌లోనూ ఈ స్నేహం కొనసాగుతుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు భారాసను కచ్చితంగా దీవిస్తారన్న నమ్మకముందని చెప్పారు. అక్టోబరు 16న వరంగల్‌లో సింహగర్జన సభ ఏర్పాటు చేసి.. భారాస మేనిఫెస్టోను ప్రకటిస్తామని కేసీఆర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మైనంపల్లికి టికెట్ ఇచ్చామని, పోటీ చేయడం, చేయకపోవడం ఆయన ఇష్టానికే వదిలేస్తున్నామని కేసీఆర్ అన్నారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడాలా? వద్దా? అన్నది ఆయనే నిర్ణయించుకోవాలని చెప్పారు.

## టీఆర్ఎస్ జాబితాలో అనూహ్యం..

### వివాదాలున్నా టికెట్లు దక్కించుకున్నారు

హైదరాబాద్: విజయంపై పూర్తి ధీమాతో ఉన్నామని, అందుకే ఒకేసారి 115 స్థానాలకు అభ్యర్థులకు ప్రకటిస్తున్నామని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలిపారు. అలాగే తమది క్రమశిక్షణ ఉన్న పార్టీ అని, పూర్తి స్థాయి వడపోత తర్వాత అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారాయన. అందుకే కేవలం.. ఏడు మార్పులు మాత్రమే చేసినట్లు హైలెట్ చేశారు. అయితే.. చెన్నమనేని లాంటి ఉత్తముడికి పౌరసత్వ వివాదం కారణంగా సీటు కేటాయించలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేసిన కేసీఆర్.. వివాదాలతో వార్తల్లోకి ఎక్కిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్యకు మాత్రం గట్టి షాకే ఇచ్చారు. ఒకవైపు మహిళా సర్పంచ్ ఆరోపణలు, మరోవైపు కడియంతో పొసగక పోవడం.. చివరకు పిలిపించుకుని అధిష్టానం మందలించినా ఆయన వైఖరిలో మార్పు రాలేదని బీఆర్ఎస్ అధిష్టానం భావించింది. దీంతో.. ఆయన స్థానంలో అంతే దూకుడుగా ప్రతివిమర్శలతో విరుచుకుపడుతున్న కడియం శ్రీహరికి అవకాశం ఇచ్చింది. అయితే.. ఏకంగా లైంగిక ఆరోపణలతో వార్తల్లో నిలిచారు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య. శేజల్ అనే బాధితురాలు వరుసగా చిన్నయ్యపై ఆరోపణలు చేయడం, ఏకంగా ఆత్మహత్యకు యత్నించడం, ఢిల్లీకి చేరి చిన్నయ్యపై వేటు వేయాలంటూ బీఆర్ఎస్ అధినేతకు సైతం విజ్ఞప్తి చేస్తూ రకరకాల రూపాల్లో నిరసనలు కొనసాగించింది. అయినా కూడా దుర్గయ్యకే మరో అవకాశం ఇచ్చారు. ఇక భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా విషయంలోనూ అలాగే జరిగింది. పాల్వంచకు చెందిన ఓ కుటుంబం ఆత్మహత్య కేసులో.. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుమారుడు వనమా రాఘవేంద్ర రావు ఏకంగా అరెస్ట్ అయ్యాడు. ఈ వివాదం ఆధారంగా ప్రతిపక్షాలు ఎమ్మెల్యేపై పలు ఆరోపణలతో తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించాయి కూడా. మరోవైపు తప్పుడు అఫిడవిట్ సమర్పించినందుకు ఏకంగా హైకోర్టు ఆయన ఎమ్మెల్యే ఎన్నికపై అనర్హత వేటు వేయడం సంచలనం సృష్టించింది కూడా. అయినప్పటికీ బీఆర్ఎస్ అధిష్టానం వనమాకే మళ్లీ టికెట్ కేటాయించడం గమనార్హం. వీళ్లతో పాటు చిన్న చిన్న వివాదల్లో నిలిచిన మరికొందరికి.. పెద్ద కంప్లయింట్‌లాగా పరిగణించకుండానే అసెంబ్లీ టికెట్ తిరిగి కేటాయించడం గమనార్హం. మరోవైపు జనగాంలో కిరికిరి జరుగుతున్న నేపథ్యంలో ఆ టికెట్‌ను జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి ఇవ్వకుండా.. పెండింగ్‌లో ఉంచినట్లు బీఆర్ఎస్ అధినేత స్పష్టం చేశారు. ముత్తిరెడ్డి చుట్టూ వివాదాలున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

## కూతురు కవిత విషయంలో కేసీఆర్ వ్యూహమేంటీ?




అసెంబ్లీ టికెట్ల జాబితాలో కనిపించని కవిత పేరు

ప్రస్తుతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కవిత

జగిత్యాల లేదా నిజామాబాద్ నుంచి పోటీ చేస్తారని ప్రచారం

ఊహాగానాలకు తెర దించిన సీఎం కెసిఆర్

పార్లమెంటు ఎన్నికల్లో గెలిపించి ఢిల్లీకి పంపాలని నిర్ణయం

దెబ్బ తిన్న చోటే పోరాడి గెలిచి చూపించాలన్నది సీఎం కెసిఆర్ వ్యూహంగా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ సీటు స్థానానికి పోటీ చేసిన కవిత అనూహ్యంగా బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ చేతిలో ఓడిపోయారు. కవిత రాజకీయ భవితవ్యంపై అప్పట్లో ఓ రకంగా సంధిగ్ధత నెలకొంది. ఆ తర్వాత కొంత గ్యాప్ వచ్చినా.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి మండలిలో అడుగు పెట్టారు కవిత.

**జగిత్యాల ? నిజామాబాద్ .??** గత రెండేళ్లుగా కవిత ప్రధానంగా రెండు నియోజకవర్గాలపై దృష్టి పెట్టారు. ఒకటి నిజామాబాద్ అర్బన్ కాగా, మరొకటి జగిత్యాల. బతుకమ్మ వేడుకల నుంచి ప్రతీ చిన్న కార్యక్రమానికి ఈ రెండు చోట్ల కవిత హాజరు కావడంతో ఈ రెండింటిలో ఏదో ఒక చోట కవిత పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. జగిత్యాల ఎమ్మెల్యేగా ఉన్న డాక్టర్ సంజయ్ కూడా తనకు టికెట్ దక్కుతుందో లేదో అన్న అనుమానాల్ని నిన్నటి వరకు కూడా వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో జగిత్యాల నుంచి కవితకు టికెట్ ఖాయం అన్న ప్రచారం జరిగింది. అయితే సీఎం కెసిఆర్ మాత్రం ఈ విషయంలో ఎలాంటి ముందడుగు వేయలేదు. తాజా జాబితాలో కవితకు చోటివ్వలేదు.

**మళ్లీ ఢిల్లీకే.!** ఓడిన చోటే కవిత ఘనవిజయం సాధించాలన్నది కెసిఆర్ పట్టుదలగా కనిపిస్తోంది. నిజామాబాద్‌లో కవితపై బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ గెలవడం కెసిఆర్ పొలిటికల్ కెరియర్‌లో ఇబ్బంది పడ్డ క్షణం. ఓ రకంగా రాజకీయంగా ఉద్ధండుడైన కెసిఆర్.. తన బిడ్డను గెలిపించుకోలేకపోయాడన్న ప్రచారం జరిగింది.

**టార్గెట్ పార్లమెంట్** 2024 ఎండాకాలంలో జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం కవితను సీఎం కెసిఆర్ సిద్ధం చేస్తున్నట్టు తాజా టికెట్ల ప్రకటనతో తేలింది. నిజామాబాద్ నుంచే కవితను బరిలో దించి ఘనవిజయం సాధించేలా అడుగులు కదపాలన్నది కెసిఆర్ వ్యూహంగా కనిపిస్తోంది.



### రెండుసార్లు రుణమాఫీ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే చెల్లింది: హరీశ్‌రావు

హైదరాబాద్: దేశంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఎలాంటి నిబంధనలు లేకుండా రుణమాఫీ పథకం అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బేగంపేటలోని హోటల్ వివంతలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి – ఎస్ఎల్‌బీసీ సమావేశానికి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో పాటు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. రెండు సార్లు రుణమాఫీ అమలు చేయడం కేసీఆర్‌కే చెల్లిందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మొత్తం 37 లక్షల మంది రైతులకు ?20,141కోట్ల రుణమాఫీ చేసే ప్రక్రియ కొనసాగుతుందని మంత్రులు ప్రస్తావించారు. "కొందరి రైతులకు బ్యాంకుల్లో వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు వంటి అవుట్ స్టాండింగ్ లోన్లు ఉండొచ్చు. వారికి వచ్చిన రుణమాఫీ డబ్బులు పాత అప్పు కింద జమ చేయకుండా నేరుగా రైతులకు అందించాలి. ఒకవేళ రైతు అప్పటికే పంట రుణం కట్టి ఉంటే... మాఫీ అయిన డబ్బు నేరుగా వారి చేతికి ఇవ్వాలి. పంట రుణం కట్టకపోతే వారికి మాఫీ చేయాలి. మొత్తంగా తమకు ప్రభుత్వం అందించిన డబ్బు వచ్చిందని రైతు సంతోషపడాలి" అని హరీశ్‌రావు అన్నారు.

## మూడింట రెండొంతుల స్థానాల్లో విజయం మాదే

### ధీమా వ్యక్తం చేసిన పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి




హైదరాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మూడింట రెండొంతుల స్థానాల్లో కచ్చితంగా విజయం సాధిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో ఓడిపోతానని సీఎం కేసీఆర్ బలంగా నమ్ముతున్నారని, అందుకే కామారెడ్డికి పారిపోయి పోటీ చేస్తున్నారని విమర్శించారు. కానీ, రెండు నియోజకవర్గాల్లోనూ ఆయన ఓడిపోబోతున్నారని జోస్యం చెప్పారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మైనార్టీ డిక్లరేషన్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ గజ్వేల్ నుంచి పారిపోతున్నారని నేను గతంలోనే చెప్పానని, మైనార్టీ నేత షబ్బీర్ అలీ చేతిలో ఆయన ఓటమి పాలవ్వడం ఖాయమని అన్నారు. " భారాస జాబితా చూశాక వచ్చే ఎన్నికల్లో అధికారం కాంగ్రెస్‌దేనని తేలిపోయింది. గజ్వేల్‌లో గెలుపుపై నమ్మకం లేకనే కేసీఆర్ కామారెడ్డిలోనూ పోటీ చేస్తున్నారు. ఆయన స్వరంలో ఓటమి భయం స్పష్టంగా కనిపించింది. కామారెడ్డి గడ్డపై పుట్టిన వ్యక్తిని నేను. ఆ నియోజకవర్గ ప్రజలపై నాకు విశ్వాసం ఉంది. కేసీఆర్‌ను అక్కడి ప్రజలు ఓడిస్తారు. ముస్లిం, మైనార్టీ లీడర్ అని చూసి అక్కడ పోటీ చెయ్యాలని చూస్తున్నారు. కేసీఆర్ ఎక్కడా గెలవరు. ఆయన్ని ఇంటికి పంపడం ఖాయం. కామారెడ్డి అభివృద్ధికి కేసీఆర్ చేసిందేమీ లేదు." అని రేవంత్ అన్నారు. మైనారిటీ డిక్లరేషన్ కమిటీకి చైర్మన్‌గా తనను ఎంపిక చేశారని, ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులతో ఇవాళ డిక్లరేషన్‌పై చర్చించామని రేవంత్‌రెడ్డి మీడియాకు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 4శాతం మైనార్టీ రిజర్వేషన్ సదుపాయం కల్పిస్తే.. దానిని 12 శాతం చేస్తానని చెప్పిన కేసీఆర్ కేవలం మాటలతోనే సరిపెట్టేశారని విమర్శించారు. " కనీసం మైనార్టీ విభాగాన్ని కూడా బలోపేతం చెయ్యలేదు. అధికారులు లేమితో ఆ విభాగం నిర్వీర్యమవుతోంది. ముస్లిం డెవలప్‌మెంట్, వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ కోసం ఏం చెయ్యాలన్నదానిపై చర్చించాం. కమిటీలో కొన్ని వినతిపత్రాలు వచ్చాయి. వాటిపై మరోసారి చర్చిస్తాం" అని రేవంత్ అన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జి మాణిక్ రావు ఠాక్రే, ఏఐసీసీ సెక్రెటరీలు కూడా హాజరయ్యారు.



### మేమంతా హరీశ్ వెంటే..

#### మైనంపల్లి వ్యాఖ్యలను ఖండించిన కేటీఆర్

హైదరాబాద్: అంతు చూసేవరకు వదలబోనని తెలంగాణ మంత్రి హరీష్ రావుపై మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలను భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. తామంతా హరీశ్‌రావు వెంట ఉంటామని చెప్పారు. "పార్టీ ఆవిర్భావం నుంచి హరీశ్‌రావు పార్టీతో ఉన్నారు. ఆయన భారాస మూలస్తంభంగా కొనసాగుతారు" అని కేటీఆర్ ట్వీట్ చేశారు. హరీశ్‌రావుపై ఇవాళ ఉదయం మైనంపల్లి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. మెదక్‌లో హరీశ్‌రావు పెత్తనం చేస్తున్నారని, అంతుచూసే వరకు వదలబోనని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో హరీశ్‌రావును అడ్రెస్ లేకుండా చేస్తానని మండిపడ్డారు. తన కుమారుడికి మెదక్ టికెట్ ఇస్తేనే తాను పోటీ చేస్తానని మైనంపల్లి అన్నారు. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మైనంపల్లి మీడియాతో మాట్లాడారు. ఇద్దరికీ టికెట్ ఇవ్వకపోతే స్వతంత్రులుగానైనా బరిలోకి దిగుతామన్నారు. కొవిడ్ సమయంలో తన కుమారుడు ఎంతో ప్రజాసేవ చేశాడని, దాదాపు రూ.8 కోట్ల మేర సొంత డబ్బులు ఖర్చు చేశాడని మైనంపల్లి తెలిపారు.

# సంపాదకీయం

## అక్కడ భారతీయులదే హవా!

ప్రపంచంలో ఏకైక సూపర్ పవర్ అమెరికాలో భారతీయులు తమ హవా కొనసాగిస్తున్నారు. మొత్తం అక్కడ 34 లక్షల మంది భారతీయులు ఉన్నారని అంచనా. వీరిలో చాలా మంది చాలా ఏళ్ల క్రితమే విద్య, ఉద్యోగాల కోసం అమెరికా వెళ్లారు. అమెరికా పౌరసత్వం కూడా తీసుకుని అక్కడే స్థిర నివాసం కూడా ఏర్పాటు చేసుకున్నారు. మిగిలిన వారు చదువుల్లో, ఉద్యోగాల్లో ఉన్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం, ఐటీ పరిశ్రమలు, స్టార్టప్స్, రాజకీయాలు ఇలా ప్రతి రంగంలోనూ భారతీయులు దుమ్ము లేపేస్తున్నారు. వ్యాపార, పారిశ్రామిక సంస్థల్లోని కీలక పదవుల్లో భారతీయులే ఎక్కువమంది ఉన్నారు. దీంతో స్వతహాగానే అమెరికన్లు.. భారతీయులపై ఈర్ష్య చూపిస్తున్నారు. ఆక్సఫర్డ్ అకడమిక్ రీసెర్చ్ తాజాగా తన నివేదికను విడుదల చేసింది. ఇందులో అనేక ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి. ముఖ్యంగా అమెరికాలో చదువుతున్న విదేశీ విద్యార్థుల్లో భారతీయులే టాప్ లో ఉన్నారు. అలాగే అమెరికాలో స్టార్టప్స్ లో ఒక బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ. 8 వేల కోట్లు) దాటిన సంస్థల్లోనూ భారతీయులదే హవా. టెక్నాలజీ ఆధారిత స్టార్టప్స్ ఏర్పాటు చేసిన ప్రతి ముగ్గురిలో ఒకరు భారతీయుడే కావడం గమనార్హం. స్టార్టప్స్ ఏర్పాటులో మన తర్వాత స్థానంలో ఇజ్రాయెల్ దేశస్తులు నిలిచారు. అమెరికా మొత్తం జనాభాలో భారతీయులు కేవలం 1 శాతం మాత్రమే ఉన్నప్పటికీ సిలికాన్ వ్యాలీలోని కంపెనీల వ్యవస్థాపకుల్లో భారతీయులు 8 శాతం ఉండటం విశేషం. అలాగే ఒక బిలియన్ డాలర్లు దాటిన కంపెనీల పరంగా చూస్తే భారతీయులు ఏర్పాటు చేసిన స్టార్టప్స్ 31 శాతం ఉండటం విశేషం. ఈ విషయంలో చైనా, బ్రిటన్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, సౌదీ అరేబియా వంటి దేశాలన్నీ మన తర్వాతే నిలిచాయి. అదేవిధంగా వివిధ రంగాల్లో అమెరికన్ల ఆదాయంకన్నా భారతీయ అమెరికన్ల ఆదాయం చాలా ఎక్కువని ఆక్సఫర్డ్ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. అమెరికన్ల ఆదాయంతో పోలిస్తే అమెరికాలో స్థిరపడ్డ ప్రవాస భారతీయుల ఆదాయం 31 శాతం ఎక్కువ అని తేలింది. ప్రస్తుతం అమెరికాలోని భారతీయుల సగటు ఆదాయం ఏడాదికి 120 వేల డాలర్లుగా ఉందని సర్వే పేర్కొంది. కాగా అమెరికా అభివృద్ధి చెందిన దేశమైనప్పటికీ ఆ దేశంలో పేదలు కూడా ఉన్నారని ఆక్సఫర్డ్ సర్వే వెల్లడించింది. ఆ దేశంలో 13 శాతం మంది పేదరికంలో మగ్గుతున్నారని వివరించింది. మరోవైపు అమెరికాలోని ప్రవాస భారతీయుల్లో 6 శాతం మాత్రమే పేదలు. అమెరికన్లు తాము సంపాదించిన దానిలో అధిక భాగం ఖర్చు చేస్తుంటే భారతీయులు మాత్రం తాము సంపాదించిన దానిలో అధిక భాగం పొదుపు చేస్తున్నారని సర్వేలో తేలింది. ఈ అంశం కూడా అమెరికన్లకు, భారతీయులకు తేడాను చూపిస్తోంది. అలాగే భారతీయులు అమెరికన్లతో పోలిస్తే కుటుంబ బంధాలకు, నైతిక విలువకు పెద్దపీట వేస్తున్నారని, అమెరికాలో ఉంటున్నప్పటికీ వారు తమ భారతీయ మూలాలను మర్చిపోవడం లేదని నివేదిక వెల్లడించింది. ఇలు పలు విషయాల్లో భారతీయులు అమెరికన్లను మార్గదర్శకులుగా నిలుస్తున్నారని సర్వే పేర్కొంది.

## మట్టి మనిషికి పుట్టెడు కష్టం



ఖమ్మం : మట్టిమనిషికి పుట్టెడు కష్టమొచ్చింది. మండుటెండలు దంచికొట్టాల్సిన సమయంలో ముంచెత్తుతున్న వరుణుడు ఇకనైనా శాంతిస్తాడా అని వేయికళ్లతో ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురించింది. ఉభయ జిల్లాల్లో అకాల వర్షాలు అన్నదాత పుట్టి ముంచుతున్నాయి. రూ.వేలకు వేలు పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుని చేతికొచ్చిన పంటను అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వెళ్తే అక్కడా ధాన్యం రైతు చిత్తవుతున్నాడు. రోజుల తరబడి ఎదురుచూసినా నిబంధనల ప్రకారం తేమశాతం రాక.. పడిగాపులు కాస్తున్నాడు.

పంట తీసేందుకూ..ఈదురుగాలులతో కూడిన అకాలవర్షాలతో 15 రోజుల్లో చేతికందే మొక్కజొన్న తోటలు నేలవాలి రైతుల గుండెల్ని పిండేస్తున్నాయి. మొక్కజొన్న పైరులో నీరు చేరి కంకులు రంగు మారి మొలకెత్తుతున్నాయి. కిందపడిన కంకులను తీయడం అన్నదాతలకు భారంగా మారింది. ఒక్కో కర్రను పైకి లేపి కంకులు తీయాలంటే మిషన్లతో అయ్యే పనికాదు. సాధారణ సమయంలో రోజువారీగా కూలి రూ. 250 చెల్లించేవారు. పెద్దఎత్తున పంటలు నేలవాలటంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. నేలవాలిన పంటలో మొక్కజొన్న తీసేందుకు ఒక్కో కూలీ రూ. 400 అడుగుతున్నారు. ఎకరంలో మక్కలు తీసేందుకు సుమారు 15 మంది కూలీలు అవసరం. నేలవాలిన తోటల నుంచి మక్కలు తీయాలంటే ఒక్కో ఎకరాకు రైతుకు రూ. 6వేలను అదనంగా భరించాలి. ధాన్యం రైతుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. కోతలకు సిద్ధంగా ఉన్న వరి పైర్లు నేలవాలటంతో పంట కోయటం సవాల్‌గా మారింది. కోత యంత్రాలకు భారీ డిమాండ్ ఉండటంతో సాధారణ సమయంలో కన్నా రెట్టింపు ధరలు చెల్లించాల్సి వస్తుంది. కోతల సమయంలో వడ్లు రాలిపోయి దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు కేంద్రాలకు తెచ్చిన కర్షకుల పరిస్థితి మరింత కంటతడి పెట్టిస్తోంది.

ముదిగొండ మండలం వెంకటాపురానికి చెందిన కాంతారావు ఐదెకరాల్లో మొక్కజొన్న పండించారు. గత సీజన్‌లో పత్తి పంటను సాగుచేస్తే గులాబీ రంగు పురుగు సోకి పెట్టుబడులు పూడలేదు. ఈసారి మొక్కజొన్న సాగుతోనైనా నష్టాల నుంచి గట్టెక్కాలన్న ఉద్దేశంతో ఎకరాకు రూ. 40 వేల చొప్పున వెచ్చించారు. చేతికొచ్చే దశలో మొక్కజొన్న పైరు అకాల వర్షానికి నేలవాలింది. మక్కలకు మొలకలు వస్తున్నాయని రైతు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

మామిడి రైతూ.. కుదేలు అకాల వర్షం.. గాలి దుమారంతో మామిడి రైతులు సైతం కుదేలయ్యారు. వరి, మొక్కజొన్న తదితర పంటలతోపాటు వందలాది ఎకరాల్లో సాగు చేసిన మామిడి తోటల్లో కాయలు సైతం పెద్ద ఎత్తున రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ సీజన్‌లో మూడుసార్లు వీచిన గాలిదుమారం.. పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం గ్రామీణం, తిరుమలాయపాలెం మండలాల్లో తీరని నష్టాన్ని మిగిల్చింది.

ఆశాజనకంగా ఉందనుకుంటే..

గత మూడేళ్లతో పోలిస్తే.. ఈ ఏడాది మామిడి ఓ మోస్తారుగా, ఆశాజనకంగా కాయడంతో రైతులు కొంత సంతోషంగా ఉన్నారు. గాలి దుమారం రైతుల సంతోషాన్ని ఆవిరి చేసింది. మార్చి 17న, ఏప్రిల్ 21, 23, 30 తేదీల్లో కురిసిన వర్షాలు, గాలిదుమారంతో సుమారు 50 శాతం మేరకు మామిడి పంట రాలిపోయింది. కొద్దో గొప్పో ఆదాయం వస్తుందనుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఎదురైంది.

415 ఎకరాల్లో పంట నష్టం..పాలేరు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో మొత్తం 609 మంది రైతులు 2,234 ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేశారు. అకాల వర్షాలు, గాలి దుమారంతో 133 మంది రైతులకు చెందిన 415 ఎకరాల్లో 50 శాతం మేరకు పంట నష్టం జరిగినట్లు ఉద్యానవన శాఖ అధికారులు అంచనా వేశారు.

తిరుమలాయపాలెం మండలం బంధంపల్లి గ్రామానికి చెందిన ముదిరెడ్డి మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు 24 ఎకరాల్లో మామిడి సాగు చేశారు. అధిక దిగుబడులు సాధించడానికి అనేక రకాలుగా సస్యరక్షణ చర్యలు తీసుకున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉందనుకొని సంతోషంగా ఉన్న కుటుంబ సభ్యులకు గాలిదుమారం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. 50 శాతానికి పైగా కాయలు రాలిపోవడంతో రైతు కుటుంబం దిగాలు చెందింది. ఇదే పరిస్థితి నియోజకవర్గంలోని 133 మంది రైతులకూ ఎదురైంది.

ముదిగొండ మండలం వెంకటాపురానికి చెందిన రవీంద్రబాబు ఏడెకరాలను కౌలు తీసుకుని మొక్కజొన్న పండించారు. ఎకరాకు సుమారు రూ. 40వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. 15 రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న తరుణంలో అకాల వర్షం విరుచుకుపడింది. మూడు, నాలుగుసార్లు ఈదురుగాలులతో కూడిన వానలతో పైరు నేలవాలింది. యంత్రాలతో తీసే పరిస్థితి లేదు. కూలీలతో కంకులు ఏరిద్దామంటే ఎకరాకు అదనంగా రూ. 6వేలు వెచ్చించాల్సి వస్తుందని రైతు వాపోతున్నారు. తీసిన తర్వాతైనా పెట్టుబడులు పూడుతాయన్న నమ్మకం లేదని బోరున విలపిస్తున్నారు. ములకలపల్లికి చెందిన కంభంపాటి దుర్గాప్రసాద్ పదెకరాల్లో వరి సాగు చేశారు. మంగళవారం కురిసన వర్షంతో కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొన్ని రాసులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. సుమారు 100 బస్తాల ధాన్యం ఎందుకూ పనికిరాకుండా పోయింది. సుమారు రూ. 5 లక్షల నష్టం వాటిల్లిందని రైతు కన్నీరుమున్నీరవుతున్నారు. వడగళ్ల వానతో గువ్వలగూడెంలో శ్రీనుకు చెందిన ఎకరం వరిపైరు నీటమునిగింది. పంటను కోయకుండానే వదిలేశారు. చేతికొచ్చిన 60 బస్తాల ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి 15 రోజుల క్రితం వచ్చారు. మూడుసార్లు వర్షం కురవటంతో ధాన్యం తడిసింది. రెండుసార్లు తేమశాతం పరీక్షలు నిర్వహించినా నిబంధనల ప్రకారం లేకపోవడంతో కాంటా కాలేదు. రాత్రనకా పగలనకా కేంద్రంలోనే పడిగాపులు కాయాల్సి వస్తోందని శ్రీను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రెండు నెలలుగా ఎదురుచూపులే..!



మహబూబాబాద్ : రెండో విడత కంటి వెలుగు శిబిరంలో కంటి పరీక్షలు చేసినవారికి రీడింగ్ గ్లాసులు వెంటనే ఇస్తున్నారు. చూపు సమస్య తీవ్రంగా ఉన్నవారిని గుర్తించి అద్దాల తయారీదారులకు వివరాలు పంపిస్తున్నారు. రెండు నెలలు దాటినా ఇటువంటి వారికి కంటి అద్దాలు అందలేదు. ప్రభుత్వం పంపించే అద్దాల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. వంద రోజుల కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జనవరి 19న మంత్రి సత్యవతి రాథోడ్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శిబిరాన్ని ప్రారంభించారు. శని, ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో మాత్రం పరీక్షలు నిర్వహించడం లేదు. మొదటి విడతకు వచ్చిన స్పందన రెండో విడత శిబిరాలకు కనిపించడం లేదు. జూన్ 15 వరకు శిబిరాలను నిర్వహించాల్సి ఉండగా, కంటి పరీక్షలే తప్ప శస్త్ర చికిత్సలు లేకపోవడంతో ప్రజలు ముందుకు రావడం లేదు. దీంతో ఈ నెల చివరి వరకు ఈ ప్రక్రియ ముగించాలని అధికారులు యోచిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఇస్తామన్న అద్దాలెప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తున్నారు. వాటి కోసం నిరీక్షిస్తూ.. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల వద్దా అనే సందేహంతో ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు.

ప్రత్యేక శిబిరమైనా పంపిణీ చేయలేదు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో వివిధ వర్గాల వారికి కంటి పరీక్షలు చేసేందుకు ఫిబ్రవరి 16న ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న కొందరికీ రీడింగ్ గ్లాసులు అక్కడే పంపిణీ చేశారు. చూపు లోపం ఉన్నవారికి కంటి అద్దాలు సిఫారస్ చేశారు. ఆర్డర్ చేసి రెండు నెలలు దాటినా ఇంకా అద్దాలు రాలేదు.

నెల్లికుదురు మండల కేంద్రంలో పరీక్షలు చేయించుకుని నెల రోజులు దాటింది. అద్దాల కోసం ఎదురు చూస్తున్న పది మందికి పైగా ఇంకా అందలేదు. వస్తాయోరావోనని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షల్లో వారే అధికం

శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేయించుకునేందుకు బీసీ, ఎస్టీలు అధికంగా వస్తున్నారు. నేటి వరకు బీసీలు 44.6 శాతం పరీక్షలు చేయించుకోగా, ఎస్టీలు 38.46, ఎస్సీలు 11.68, ఓసీలు 4.64, మైనార్టీలు 0.61 శాతం మంది మాత్రమే పరీక్షలు చేయించుకున్నారు. మహిళలు 51.14 శాతం కాగా పురుషులు 48.71, ట్రాన్స్‌జెండర్ 0.15 శాతం మంది ఈ శిబిరాల్లో పరీక్షలు చేసుకున్నారు.

వచ్చిన వెంటనే ఇస్తున్నాం.. – డాక్టర్ అంబాల అంబరీష, జిల్లా నోడల్ అధికారి

స్వల్ప దృష్టి లోపమున్న వారికి సరిపడే రీడింగ్ అద్దాలు ఇస్తున్నాం. సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని గుర్తించి తయారీదారులకు ఆర్డర్ చేస్తున్నాం. అక్కడి నుంచి వచ్చిన వెంటనే బాధితులకు అందిస్తున్నాం. తయారీ సంస్థల వద్ద జాప్యం జరుగుతోంది.

## పెరిగిన వేతనం.. కార్మికుల్లో ఆనందం

మహబూబాబాద్ : సచివాలయం ప్రారంభోత్సవం.. మేడే సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారి వేతనాలను పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీ, పురపాలిక పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు రూ. 1,000 వేతనం పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో జిల్లాలోని పంచాయతీ, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది. సిబ్బందికి కొంత ఊరట కలుగనుంది. సర్కారు తీసుకున్న వేతనాల పెంపు నిర్ణయంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

2103 మందిజిల్లా వ్యాప్తంగా 2103 మంది పారిశుద్ధ్య కార్మికులకు లబ్ధి చేకూరనుంది. 461 పంచాయతీల్లో 1732 మంది, నాలుగు మున్సిపాలిటీల్లో 371 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రస్తుతం నెలకు రూ. 8,500 వేతనం వస్తుండగా, పెంచిన వేతనంతో రూ. 9,500 చేతికి అందనున్నాయి. పురపాలికలో రూ. 15 వేలు ఇస్తుండగా, పెరిగినదానితో రూ. 16 వేలు అందనున్నాయి.



జిల్లాలో పంచాయతీలు 461

పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య 1732

సంతోషంగా ఉంది

ధర్మారపు సుధాకర్, అమనగల్

పంచాయతీ సిబ్బంది వేతనాలు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేయడం సంతోషంగా ఉంది. ఇది కొంతవరకు కుటుంబానికి ఆసరాగా ఉపయోగపడుతుంది.

కొంతవరకు ఉపయోగం

లచ్చయ్య, డోర్నకల్

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. వేతనాలు పెంచడాన్ని స్వాగతిస్తున్నాం. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయి. ఇది కొంతవరకు ఉపశమనం.

## నిల్వలు లేక.. జిన్నింగ్ కాక

వేములవాడ : గతంలో ఎన్నడూ లేని విధంగా జిన్నింగ్ మిల్లులు ఈసారి నష్టాలను మూట గట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిల్లులకు పూర్తిస్థాయిలో పత్తి రాక అంతంత మాత్రంగానే జిన్నింగ్ సాగింది. జిల్లాలో వేములవాడ, కోనరావుపేట, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో ఆరు జిన్నింగ్ మిల్లులున్నాయి. ఇందులో ఏ ఒక్క మిల్లుకు పూర్తి స్థాయిలో జిన్నింగ్ చేసేంత పత్తి నిల్వలు రాలేదు. దీంతో పనులు లేక మిల్లులు వెలవెలబోయాయి. జిల్లాలో ఈ సీజన్‌లో 69,200 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా మొత్తం 4.84 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పత్తి సీజన్ ముగింపు దశకు వచ్చినప్పటికీ జిల్లాలో కేవలం 70,425 క్వింటాళ్ల పత్తిని మాత్రమే జిన్నింగ్ మిల్లులు, ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇక్కడి రైతుల వద్ద దళారులు పెద్ద ఎత్తున పత్తిని సేకరించి మహారాష్ట్ర, ఆదిలాబాద్, భైంసా ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లులకు తరలించారు. ఇక్కడి కంటే అక్కడి వ్యాపారులు క్వింటాల్‌కు రూ. 200లకు పైగా అదనంగా ధర చెల్లించడంతో చాలా మంది దళారులు తరలించారు. ధర పెరుగుతుందనే ఆశతో చాలా మంది అన్నదాతలు పత్తి నిల్వలను ఇళ్లలోనే చాలా రోజులు నిల్వ చేసుకున్నారు. తీరా ధర పెరగకపోవడంతో దళారులకు విక్రయించారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున దళారులు రైతుల ఇళ్ల వద్దనే కాంటాలు పెట్టి



పత్తి కొనుగోలు చేయడంతో స్థానిక మిల్లులకు అంతంత మాత్రంగానే పత్తి వచ్చింది. జిన్నింగ్ మిల్లులకు పూర్తిస్థాయిలో నిల్వలు రాక వెలవెలబోయి మిల్లుల నిర్వహణ యజమానులకు భారమైంది. ఫలితంగా జిన్నింగ్ మిల్లులు నష్టాలను మూట కట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మిల్లు యజమాని ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటి దారి పట్టిన కూలీలు

జిన్నింగ్ మిల్లుల్లో పూర్తిస్థాయిలో పత్తి జిన్నింగ్‌కు రాకపోవడంతో అందులో పని చేసే కూలీలకు ఉపాధి లేక ఇంటి ముఖం పట్టారు. ఒక్కొక్క మిల్లులో పూర్తి స్థాయిలో జిన్నింగ్ పనులు జరుగుతాయనే అంచనాతో మిల్లుల యజమానులు దాదాపు 60 నుంచి 75 మంది కూలీలను పని కోసం రప్పించుకున్నారు. వీరంతా బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి మధ్యవర్తుల ద్వారా ఒప్పందం చేసుకొని వచ్చారు. తీరా ఇక్కడికి వచ్చిన తరవాత మిల్లులకు పూర్తిస్థాయిలో పత్తి నిల్వలు రాక చాలా మంది కూలీలకు పని లేకుండా పోయింది. దీంతో చేసేది లేక చాలా మంది ఇంటికి తిరుగు పయనమయ్యారు. ఈ ఏడాది పత్తి సీజన్ మొదలైనప్పటి నుంచి మిల్లులకు నిల్వలు అంతంత మాత్రంగానే రావడంతో కూలీలకు సరిపడా ఉపాధి లేకుండా పోయింది. వేములవాడ శివారు నాంపల్లి జిన్నింగ్ మిల్లులో ఏటా సీజన్ పూర్తయ్యే నాటికి దాదాపు 60 వేల నుంచి 80 వేల క్వింటాళ్ల పత్తిని జిన్నింగ్ చేసేవారు. అలాంటిది ఈ సీజన్‌లో కేవలం 20 వేల కింటాళ్లు మాత్రమే చేశారు. దీంతో చాలా మంది కూలీలు పని లేక ఇంటికి వెళ్లిపోయారు. జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లుల్లోనూ పెద్ద సంఖ్యలో కూలీలకు ఉపాధి కరవైంది. మరోవైపు మిల్లులకు పూర్తి స్థాయిలో పత్తి రాక నష్టాలే మిగిలాయి. గతంలో ఇలాంటి పరిస్థితి రాలేదుజిన్నింగ్ మిల్లులకు ఇలాంటి గడ్డు పరిస్థితి గతంలో ఎప్పుడూ రాలేదు. ఏటా దాదాపు 60 వేల నుంచి 80 వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి జిన్నింగ్ చేసేది. అలాంటిది ఈ సీజన్‌లో కేవలం 20 వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశాం. జిన్నింగ్‌కు సరిపడా పత్తి నిల్వలు లేక, పని లభించక చాలా మంది కూలీలు తిరిగి వెళ్లిపోయారు. ఈసారి చాలా మిల్లులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఆరోగ్యరెడ్డి, మిల్లు నిర్వాహకుడు, వేములవాడ

## ఇంకుడుగుంతలతో జలసంరక్షణ

జగిత్యాల : గతంలో వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటి తీవ్ర కరవు పరస్థితులను ఎదుర్కొనడంతో ప్రభుత్వం ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టుకోవాలని ఆదేశించింది. కొంత కాలంగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో ఇంకుడు గుంతల నిర్మాణాలపై దృష్టి సారించడం తగ్గించారు. అధికారులు విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించి, నిర్దేశించిన లక్ష్యం చేరుకోవడంలేదు. ఫలితంగా ఏటా వృథా నీటిని అడ్డుకోకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి కరవు పరిస్థితులు నెలకొంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రజల్లో కొంత అవగాహన పెరిగి దృష్టి సారించిన్పటికీ కొన్నేళ్లుగా ప్రభుత్వం అందించే ప్రోత్సాహక డబ్బులు సకాలంలో చెల్లింపులు కాకపోవడంతో నిర్మాణాలపై లబ్ధిదారులు నిరాసక్తత చూపుతున్నారు. జిల్లాలోని 380 పంచాయతీల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 1,01,735 ఇళ్లకు గానూ 44,941 పూర్తిచేసినట్లు గుర్తించారు. మిగతా నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినా పూర్తి చేయలేకపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ ప్రాంతాల్లో 1781 నిర్మాణాలు చేపట్టాలని గుర్తించగా ఇందులో 802 ప్రాంతాల్లో పూర్తిచేయగా, మిగతా ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

నిరుపయోగమే!

గతంలో నిర్మించుకున్న ఇంకుడుగుంతలు వర్షపు నీటిని మళ్లించే చర్యలు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. లక్ష్యం కోసం నిర్మించి వదిలేయడంతో వృథాగా నీటికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ ప్రాంతాల్లో మురుగు నీరు మళ్లించడం ద్వారా భూగర్భ జలాలు పెరగడమే కాకుండా పరిశుభ్రంగా ఉండే అవకాశముంది. ఇందుకు నిర్మాణాలే కాకుండా వినియోగంలోకి వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

అవగాహన కల్పిస్తున్నాం

లక్ష్మీనారాయణ, డీఆర్డీవో

ఇంటింటా ఇంకుడు గుంత నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించాం. ఇప్పటికే గ్రామాల్లో సెర్ప్, ఈజీఎస్ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించి నిర్మాణాలు చేపడుతున్నారు. వర్షాకాలంలోపు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక తయారు చేశాం. ప్రస్తుతం నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

# ప్రగతి.. ప్రతిపాదనలకే పరిమితం

గోదావరిఖని : దళిత వాడలు, గిరిజన తండాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన సర్వే కాగితాలకే పరిమితమైంది. ప్రభుత్వ ఆదేశాలతో ఆగమేఘాలపై క్షేత్ర స్థాయికి వెళ్లిన అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించారు. సిమెంటు రహదారులు, మురుగు కాలువలు, విద్యుత్తు స్తంభాలు, తాగునీటి సరఫరా తదితర సమస్యలను గుర్తించారు. అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదించి రెండేళ్లు దాటినా పైసా నిధులు కేటాయించలేదు. దీంతో కాలనీల్లో కష్టాలు తీరతాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. మరోవైపు వర్షాకాలంలో బురదమయంగా మారిన రహదారులపై నరకయాతన తప్పడం లేదు. మురుగు కాలువ వ్యవస్థ లేక దుర్గంధంతో జీవనం సాగించాల్సి వస్తోంది. జిల్లాలోని 452 దళిత, 28 గిరిజన తండాలు కలిపి మొత్తం 480 ఆవాసాల్లో రూ.128.88 కోట్లకు సంబంధించి ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి.

ప్రాధాన్య క్రమంలో నమోదు

జిల్లాలో 266 పంచాయతీల్లో సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా ఎస్సీ సామాజిక వర్గ జనాభా 1,54,855. ఇందులో 77,311 మంది పురుషులు, 77,544 మంది మహిళలున్నారు. ఎస్టీల జనాభా



14,945 కాగా 7,520 మంది పురుషులు, 7,425 మంది మహిళలున్నారు. పంచాయతీ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సమస్యలపై ఆరా తీశారు. ఎక్కడెక్కడ ఎలాంటి వసతులు అవసరమనే విషయమై ప్రజల అభిప్రాయాలు తీసుకున్నారు. సిమెంటు రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు, ప్రమాదకర విద్యుత్తు వ్యవస్థ, తాగునీటి పైపులైన్ల నిర్మాణం, లీకేజీల వంటి వాటిపై ప్రాధాన్య క్రమంలో నమోదు చేసుకున్నారు.

రహదారులు.. విద్యుత్తు సరఫరా

దళిత, గిరిజన ఆవాసాల్లో ప్రధానంగా సిమెంటు రహదారులకు సంబంధించి 2301 పనులకు రూ.50.11 కోట్ల నిధులతో ప్రతిపాదించారు. 787 కొత్త నల్లా కనెక్షన్లు, 243 లీకేజీ నల్లాలున్నట్లు గుర్తించారు. జిల్లావ్యాప్తంగా 1,26,098 మీటర్ల మేర ఎల్‌టీ లైన్, 442 మధ్యస్థ స్తంభాల బిగింపు, 58 ఒరిగిన, 168 విరిగిన స్తంభాలు, 11 కేవీ 188, ఎల్‌టీ(ఇళ్లలోకి వచ్చే విద్యుత్తు తీగలు) లైన్ల తొలగింపు కోసం నివేదించారు. 57 చోట్ల డిస్ట్రిబ్యూషన్ (ట్రాన్స్‌ఫార్మర్(డీటీఆర్) సామర్థ్యం పెంపు, 68 డీటీఆర్‌లు అదనంగా అవసరమవుతుందని నిర్ధారించారు.

సమస్యలతో సహవాసంమౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనుల కోసం అధికారులు పంపిన ప్రతిపాదనలు అటకెక్కాయి. రాష్ట్రంలో హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో ఆ నియోజకవర్గంలో తప్ప మిగిలిన ప్రాంతాల్లో ఇప్పటికీ పైసా నిధులు మంజూరు చేయలేదు. ప్రతి సంవత్సరం వానాకాలంలో గుంతలు, బురదమయమవుతున్న రహదారులపై ప్రజలు నరకయాతన తప్పడం లేదు. మురుగు కాలువ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లి వ్యాధులు ప్రబలుతున్నాయి. అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలకు నిధులు మంజూరు కాలేదని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తే పనులు చేస్తామని పేర్కొంటున్నారు.

# ఇంటింటా పచ్చదనం

కరీంనగర్ : భూతాపం తగ్గాలన్నా.. వానలు సమృద్ధిగా కురవాలన్నా.. స్వచ్ఛమైన గాలి అందాలన్నా.. పర్యావరణంలో సమతుల్యత ఉండాలన్నా.. మొక్కలు నాటాలి.. వృక్షాలుగా ఎదిగే వరకు కాపాడాలి.. ప్రభుత్వం గత ఎనిమిదేళ్లుగా తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా విరివిరిగా నాటడమే కాకుండా ప్రతీ ఇంటికి పూల, పండ్ల మొక్కలు పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది కూడా వాటిని అందజేసేందుకు సిద్ధం చేస్తున్న సందర్భంగా కథనం.

కరీంనగర్ జిల్లా కేంద్రంలో తగ్గిన అటవీ విస్తీర్ణంతో ఎడారిని తలపించింది. ఈ పరిస్థితిని మార్చేందుకు గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాలు జారీ చేశారు. నాటి నుంచి మొక్కలు నాటేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంతో పోలిస్తే లక్షలాది చెట్లు పెంచడంతో పచ్చదనం ఉట్టి పడుతోంది. ప్రభుత్వ ఖాళీ స్థలం కనిపిస్తే చాలు గుంతలు తవ్వి.. మొక్కలు నాటుతున్నారు. నగర శివారుల్లోని శాతవాహన విశ్వవిద్యాలయం, బుల్‌సెమన్ సెంటర్, సిరిసిల్ల బైపాసు రోడ్డులో మొక్కలు నాటడంతోపాటు, రాశివనం, మియావాకీ ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతాలు చిట్టడవులను తలపిస్తున్నాయి. ఆయా ప్రాంతాలు ఆహ్లాదకరంగా మారాయి. ప్రత్యేకంగా నర్సరీలు అందుబాటులో ఉన్నాయి.

లక్ష్యానికి మించి..పచ్చదనం కాపాడేందుకు వీలుగా ఏటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించగా మొత్తం అయిదు లక్షలు నాటేందుకు లక్ష్యమైనా ఆరు లక్షలు నాటేందుకు ప్రణాళిక రచించారు. 3.6 లక్షల మొక్కలు ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా, వైకుంఠధామాలు, విద్యాసంస్థలు, రిజర్వాయర్లు, ఇతర ప్రాంతాల్లో నాటుతుండగా, మరో 2.4 లక్షలు ఇళ్లల్లో పెంచేవి ఉన్నాయి.

ఇంజినీరింగ్ అధికారులకు బాధ్యతలు

నగరంలోని 60 డివిజన్లలో పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వీటిని ఆయా డివిజన్ల ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ప్రత్యేక వాహనంలో రెండు రోజులలో డివిజన్ కేంద్రాలకు తరలిస్తారు. డివిజన్‌కు సుమారు 3,789 పూలు, పండ్ల మొక్కలు ఉండనున్నాయి. ఒక్కో డివిజన్‌లో 800 ఇళ్లకు వీటిని అందించాలని లక్ష్యంగా నిర్ణయించారు. కొన్ని డివిజన్లలో ఆయా ఇళ్లల్లో స్థలాలే ఉండటం లేదు. అలాంటి డివిజన్లకు తగ్గించి అవసరమున్న వాటికి అత్యధికంగా ఇచ్చే అవకాశాలు లేకపోలేదు. ఇప్పటివరకు 9 లక్షల మొక్కలు ఇళ్లల్లో పెంచుతున్నారని వివరించారు.

పంపిణీ చేసే రకాలు..చామంతి, గన్నేరు, అఖిలిఫా, గులాబీ, కనకంబరం, కృష్ణ తులసి, లిల్లీ, మల్లె, మందార, మారేడు, మిక్స్‌డ్ ఖలీఫా, పారిజాతం, రెడ్‌నైట్, రోజ్, తులసి, జామ, కరివేపాకు, మునగ, సీతాఫలం, సింధూరం, ఉసిరి, దానిమ్మ తదితర రకాలు ఉన్నాయి.

# జులైలో పోటు.. ఆగస్టులో లోటు!



భూపాలపల్లి : వరుణుడు మొఖం చాటేశాడు.. ఆగస్టులో సరైన వర్షపాతం నమోదు కాలేదు. దీంతో అటు పంటలపై ప్రభావం పడుతుండగా, ఎండ వేడి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సారి వానాకాలం చాలా భిన్నంగా ఉంది. ప్రారంభంలో వర్షాల కోసం ఎదురుచూపులు తప్పలేదు. సరైన వానలు లేకపోవడంతో పంటల సాగుపై అన్నదాతలు అయోమయంలో ఉండగా జులైలో ఒక్కసారిగా వర్షం ప్రతాపాన్ని చూపింది. జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు, వాగులు పొంగి పొర్లాయి. ఆగస్టు రాగానే మళ్లీ వరుణుడి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఆకాశంలో మబ్బులు రావడంతో సరిపోతోందే కానీ, ఒక్క మంచి వర్షం కురిసిన దాఖలాలు లేవు.

ఎంతో వ్యత్యాసం

భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి వర్షపాతాన్ని పరిశీలిస్తే జూన్‌లో సరాసరి 158.8 మిల్లీ మీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా 51.1 మి.మీ నమోదైంది. అంటే, 68 శాతం లోటు వర్షపాతం.. జులైలో 317.8 మిల్లీ మీటర్లు నమోదు కావాల్సి ఉండగా 807.3 మి.మీ కురిసి 154 శాతం అధిక వర్షపాతం నమోదైంది. వరద ముంచెత్తి పంటలు కొట్టుకుపోగా, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే.. తాజాగా ఆగస్టులో మళ్లీ వరుణుడు మొఖం చాటేయడంతో జిల్లాలో లోటు వర్షపాతం నమోదవుతోంది. ఇప్పటివరకు ఆగస్టులో 178.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 26.5 మి.మీ మాత్రమే నమోదవడంతో 86 శాతం లోటు వర్షపాతం నమోదైంది. దీంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది.

వర్షాధారిత పంటలే

జిల్లా వ్యాప్తంగా పంటల సాగు పరిశీలిస్తే.. వానాకాలం సాగులో జిల్లాలోని 45 క్లస్టర్ల పరిధిలో 271 గ్రామాల్లో 2.25 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు చేశారు. అందులో మోటారు బోర్ల ద్వారా 72 వేల ఎకరాలు, బావుల ద్వారా 3 వేల ఎకరాలు, కెనాల్ ద్వారా 2 వేల ఎకరాలు, లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 8 వేల ఎకరాలు, చెరువులు, కుంటల ద్వారా 4 వేల ఎకరాలు సాగు చేస్తుండగా కేవలం వర్షం పైనే ఆధారపడిన వర్షాధారిత పంట భూములు 50 వేల ఎకరాలకు పైగా ఉన్నాయి. జులైలోనే అనుకున్న వర్షాలు కురవడం, ఆగస్టులో వానలు మొఖం చాటేయడంతో వర్షాధారిత పంట భూములకు నీటి ఇబ్బందులు తప్పేలా లేవు. మరోవైపు జిల్లాలో ఎండ వేడి, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

4.62 మీటర్ల లోతులో భూగర్భ జలం

జిల్లాలో జులైలో కురిసిన వర్షాలతో భూగర్భజలాలు పైకి వచ్చాయి. జూన్‌లో 9.72 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు తాజాగా 4.62 మీటర్ల లోతులో ఉన్నాయి. గతేడాదిలో పోలిస్తే 1.25 మీటర్ల పైకి జలపాతం పెరిగింది. ఇంతవరకు బాగానే ఉన్నా వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలపై ప్రభావం పడుతుందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. నీటిని అవసరం మేరకు వినియోగించుకుంటూ పొదుపు చర్యలు పాటించాలని తెలిపారు.

# ఆదాయం భళా... అభివృద్ధిలో డీలా!



గోదావరిఖని : రామగుండం నగరపాలికకు అత్యధికంగా ఆదాయాన్ని సమకూర్చే కాలనీలే అయినప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనకంజలో ఉంటున్నాయి. భవన నిర్మాణ అనుమతులు, ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ పేరిట రామగుండం కార్పొరేషన్‌కు అత్యధిక ఆదాయాన్ని సమకూర్చిపెట్టిన మార్కండేయకాలనీ, శారదానగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపట్టడంలో బల్దియా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పద్మావతినగర్ ప్రాంతంలో చినుకుపడిందంటే ఇంట్లోంచి బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. శారదానగర్ ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి కావడంతో కొంత మేరకు ప్రధాన సమస్య పరిష్కారమైనప్పటికీ చాలా వరకు గల్లీల్లో రహదారుల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అక్కడక్కడా భూగర్భ మురుగు కాలువల నిర్మాణం చేపట్టినప్పటికీ రోడ్లు వేయకపోవడంతో అటువైపు వాహనాలు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి.

తాగునీటి తిప్పలు

పద్మావతినగర్‌లోని పలు వీధుల్లో తాగునీటి సరఫరా కోసం ప్రధాన పైపులైన్లు వేసినప్పటికీ అంతర్గత పైపులైన్లు వేయలేదు. దీంతో ఆయా ప్రాంతాల వారికి తాగునీటి తిప్పలు తప్పడం లేదు. నగరంలో ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తున్నామని చెప్పుకుంటున్న నగరపాలక అధికారులు తమను మాత్రం పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపరితల మురుగు కాలువలు లేకపోవడంతో వర్షం పడిందంటే చాలు రోడ్లు జలమయం అవుతున్నాయి. ఇళ్లల్లోంచి బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారి నుంచి పద్మావతి కాలనీ వరకు రోడ్డు గుంతలు, బురదమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులో కొంత దూరం భూగర్భ మురుగు కాలువ నిర్మాణం కోసం రోడ్డును తవ్వి పైపులైన్లు వేయడంతో గుంతలు మరింత పెరిగాయి. శారదానగర్ ప్రాంతంలోని వివిధ కాలనీలకు చెందిన మురుగు నీరంతా టీచర్స్ కాలనీ సమీపంలో నిలుస్తోంది. దీంతో కాలనీ వాసులు దుర్గంధంతో పాటు దోమలబెడదతో ఇబ్బంది పడుతున్నారు. కాలనీ ముందు ఖాళీ స్థలం ఎక్కువగా ఉండటంతో రాత్రి వేళల్లో మందుబాబులు అడ్డాలు వేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పాముల బెడద సైతం తప్పడం లేదు. కాలనీలోని నగరపాలక ఉద్యానవనం నిర్వహణపై బల్దియా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంది. రామగుండం నగరపాలక ప్రాంతంలో లేఔట్ అనుమతి పొందిన మొట్టమొదటి టీచర్స్ కాలనీ ఇప్పటికీ సమస్యల్లోనే ఉంది.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం

ఒడ్నాల సరోజన, పద్మావతి కాలనీ

పద్మావతి కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వివిధ రకాల పన్నుల వసూళ్లపై చూపుతున్న శ్రద్ధ ఆయా ప్రాంతాల సమస్యల పరిష్కారానికి చూపడం లేదు. వర్షం పడిందంటే రోడ్డు బురదమయంగా మారుతుంది. ఇంటినుంచి బయటకు రాలేని దుస్థితి. వరద నీరంతా ఇళ్లముందే నిలుస్తుంది. ఇక్కడ ఇప్పటి వరకూ తాగునీటి కొళాయి కనెక్షన్లు లేవు. అధికారులు స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి.

దుర్గంధం భరించలేకున్నాం

టీచర్స్ కాలనీ పైవైపున్న వివిధ కాలనీలకు చెందిన దుర్గంధమంతా మా కాలనీ సమీపంలోనే నిలుస్తుంది. అటు నుంచి కిందికి వెళ్లేందుకు ప్రధాన మురుగు కాలువ లేకపోవడంతో మురుగునీటితో ఆ ప్రాంతం చెరువులా ఉంటుంది. దుర్గంధం, దోమల బెడద తీవ్రంగా ఉంది. అనేక మార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. పాలకవర్గం స్పందించి మా సమస్యను పరిష్కరించాలి. ఆర్.శంకర్, టీచర్స్ కాలనీ

# హరితహారానికి అదనం

కరీంనగర్ :ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంతో ప్రతి పల్లె పచ్చదనం సంతరించుకుంటుంది. తొమ్మిది విడతలుగా డీఆర్డీఏ ద్వారా దాదాపు 2.50 కోట్ల మొక్కలను నాటారు. ఈ ఏడాది స్వాతంత్ర్య వజ్రోత్సవాలలో భాగంగా జిల్లాలోని 380 పంచాయతీలో ప్రతి పంచాయతీలో అదనంగా మరో వెయ్యి మొక్కలను నాటేందుకు పంద్రాగస్టున శ్రీకారం చుట్టారు. దీనికి తోడుగా అమృత్ సరోవర్‌లో భాగంగా 'మేరీ మిట్టి-మేరీ దేశ్'లో భాగంగా అమర జవాన్లు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గౌరవించుకునేందుకు స్మారక వనాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ప్రతి పంచాయతీ పరిధిలో మరో 75 మొక్కలను నాటారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది హరితహారంలో 18.03 లక్షలు కాగా దాదాపు వందశాతం పూర్తి చేయగా, అదనంగా ప్రతి పంచాయతీలో హరితహారానికి అదనంగా 1075 మొక్కలను నాటుతున్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఏడు శాతం పచ్చదనం పెరిగేలా కృషి చేశారు. ఏటా హరితహారంలో మొక్కలు నాటుతున్నప్పటికీ సంరక్షణలో నిర్లక్ష్యంతో సగానికిపైగా మొక్కలు బతకడం లేదన్న ఆరోపణలు ఉండగా, మరిన్ని ప్రాంతాల్లో నాటేందుకు తీసుకెళ్లి పక్కన పడేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో 17.75 లక్షల లక్ష్యం

జిల్లాలో 380 పంచాయతీలలో తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా 24 లక్షల మొక్కల లక్ష్యంగా ఇందులో డీఆర్డీఏ ద్వారా 18.03 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించగా, మిగతా మొక్కలు అటవీశాఖ ద్వారా నాటుతున్నారు. ఇందులో ఇప్పటికే డీఆర్డీఏ ద్వారా 17,55,784 మొక్కలను నాటగా ఇందులో 13,05,784 మొక్కలను 1,293 బ్లాకులలో నాటగా, మరో 4.50 లక్షల మొక్కలు ఇళ్లలో నాటేందుకు అందించారు. జిల్లాలో 380 పంచాయతీలో ఒక్కో గ్రామానికి వెయ్యి మొక్కల చొప్పున నాటేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో ఇప్పటికే 376 పంచాయతీల్లో 3.80 లక్షల మొక్కలను నాటే ప్రాంతాలను గుర్తించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో వెల్గటూర్‌లో 30 వేలు, గొల్లపల్లిలో 27వేలు, జగిత్యాల గ్రామీణంలో 29 వేలు, ధర్మపురిలో 25 వేలు, మేడిపల్లి 25 వేలు, కొడిమ్యాలలో 24 వేలు, మల్లాపూర్‌లో 23 వేలు, మల్యాలలో 19 వేలు, ఇబ్రహీంపట్నంలో 17 వేలు, కథలాపూర్‌లో 19 వేలు, బీర్‌పూర్ 15 వేలు, కోరుట్లలో 15వేలు, రాయికల్‌లో 32వేలు, పెగడపల్లిలో 23వేలు, సారంగాపూర్‌లో 15వేలు, బుగ్గారంలో 11వేలు, మెట్‌పల్లిలో 23, జగిత్యాలలో 5వేల చొప్పున మొక్కలను నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇందులో 1,36,527 మొక్కల ఇప్పటికే నాటారు.

ప్రతి పంచాయతీలో స్మారక వనాలుమేరీ మట్టీ-మేరా దేశ్‌లో భాగంగా ప్రతి పంచాయతీలో అమర జవాన్లు, దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వారిని గౌరవించుకునేందుకు స్మారక వనాలు ఏర్పాటు చేశారు.

# పల్లె యువతకు ప్రోత్సాహం

సిరిసిల్ల : పల్లె ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. గొప్ప లక్ష్యంతో టీకేపీ (తెలంగాణ క్రీడా ప్రాంగణాలు)ను ఏర్పాటు చేసినా క్రీడా పరికరాలు లేక ఆదరణకు నోచుకోలేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టడంతో గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రయోజనం చేకూరనుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1,215 గ్రామ పంచాయతీలున్నాయి. గతేడాది ప్రభుత్వ స్థలాల్లో ఎకరా విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు కసరత్తు చేశారు. స్థలాలు అందుబాటులో లేకపోవడంతో పాఠశాలల్లో నిర్వహించుకునేందుకు వెసులుబాటు కల్పించారు. యుద్ధ ప్రాతిపదికన టీకేపీ (తెలంగాణ క్రీడా ప్రాంగణాలను) పూర్తి చేయడానికి అధికార యంత్రాంగం కృషి చేసింది. ప్రస్తుతం ఆ ప్రాంగణాలకు క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో క్రీడా పరికరాలు సమకూర్చనున్నారు. మున్సిపాలిటీలు, కలెక్టర్ కార్యాలయాలతోపాటు గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాల సంఖ్యకు అనుగుణంగా 1,606 కిట్లు జిల్లాలకు వచ్చాయి. జిల్లా యువజన క్రీడాశాఖ పర్యవేక్షణతో వాటిని మండలాలు, మున్సిపాలిటీలకు అప్పగించారు. మండలాలకు చేరుకున్న పరికరాలు సరిగా ఉన్నాయా, లేదా అనే తనిఖీ పూర్తయింది. ప్రభుత్వం అనుమతిస్తే త్వరలోనే గ్రామ పంచాయతీలకు అప్పగించనున్నారు.

పర్యవేక్షణ అవసరం

క్రీడా ప్రాంగణాలకు పంపిణీ చేసే పరికరాల విషయంలో అధికారుల పర్యవేక్షణ అవసరం. పూర్తిగా గ్రామ పంచాయతీలపై ఆధారపడితే పరికరాలు తస్కరణకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. స్థానికంగా ఉన్న క్రీడాకారులతో ఓ కమిటీ వేసి వాటి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే



పాడైపోకుండా కాపాడవచ్చని పలువురు భావిస్తున్నారు. రోజూ సాధన అనంతరం వాటిని సరిచూసుకుని భద్రపరిచేలా కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలి. అప్పుడే ఎక్కువ రోజులపాటు ఉపయోగపడతాయి.

అనుమతి రాగానే పంపిణీ

క్రీడా పరికరాల కిట్లు రావడంపై రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల యువజన, క్రీడల అధికారులు రాందాస్, డా.రవికుమార్‌లతో మాట్లాడగా క్రీడా పరికరాల కిట్లు వచ్చాయని, వాటిని మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో నిల్వ చేశామని తెలిపారు. పరికరాలు సరిగ్గా ఉన్నాయా, లేదా అన్న తనిఖీ పూర్తయిందని పంపిణీ, నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా రాలేదని చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పంపిణీ చేస్తామని, గ్రామాల్లో చాలా మందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు.

వెక్కిరిస్తున్న సమస్యలు...

ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి ఊరికి తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. కొన్ని చోట్ల వీటి ఏర్పాటు లోపభూయిష్టంగా ఉంది. చాలా చోట్ల కేవలం బోర్డులు పాతి అధికారులు చేతులు దులుపుకున్నారు. గ్రామాలకు దూరంగా ప్రాంగణాలు ఏర్పాటుతో యువకులు వాటిపై ఆసక్తి చూపడం లేదు. ఇప్పటి వరకు అక్కడ ఆడిన దాఖలాలు కనిపించలేదు. మైదానంలో విద్యుత్తు దీపాలు, నీటి వసతులు లేకపోవడంతో వినియోగించేవారు లేక పిచ్చి మొక్కలు పెరిగాయి. వీటి నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలకు ఉన్నప్పటికీ ఎక్కడా పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులు చొరవ తీసుకుని తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు వసతులు కల్పిస్తే యువకులకు ప్రయోజనకరంగా మారనున్నాయి. దీంతో పల్లె ప్రాంతాలకు చెందిన యువత రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంది.

కిట్‌లో ఉండేవి

క్రికెట్: కశ్మీర్ విల్లో నం.5 బ్యాట్ ఒకటి, ఫుల్‌సైజ్ కశ్మీర్ బ్యాట్ ఒకటి, బ్యాటింగ్ గ్లౌజ్‌లు 2 జతలు, వికెట్ కీపింగ్ గ్లౌజ్‌లు జత, బ్యాటింగ్ లెగ్ ప్యాడ్లు 2 జతలు, వికెట్ కీపింగ్ లెగ్ గార్డ్‌లు ఒక జత, వికెట్లు రెండు జతలు, క్రికెట్ బంతులు ఆరు, క్రికెట్ ఆర్మ్ గార్డ్‌లు 2, క్రికెట్ తిగ్‌ప్యాడ్లు నాలుగు, క్రికెట్ కిట్ బ్యాగు ఒకటి.

వాలీబాల్: సింథటిక్ వాలీబాల్‌లు నాలుగు, నెట్‌లు 2, సైకిల్ పంపు ఒకటి.డంబెల్స్ (2.5 కిలోలు, 5 కిలోలు, 7.5 కిలోలు) మూడు సెట్లు, మెసరింగ్ టేపు ఒకటి, డిస్కస్ త్రో 1, 2 కిలోలు, టెన్నీకాయిట్ రింగ్స్ ఆరు, స్కిప్పింగ్ తాళ్లు నాలుగు, విజిల్స్ మూడు, స్టాప్‌వాచ్ ఒకటి, కిట్ బ్యాగు ఒకటి, క్రీడాకారులకు 75 టీషర్టులు ఉన్నాయి.

# భక్తులకు తొలగనున్న ఇబ్బందులు

వేములవాడ : రాజన్న ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదుల నిర్వహణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. నిర్మించినప్పటి నుంచి నిర్వహణ లేక తాళాలు వేశారు. మార్చి 30న జరిగిన శ్రీరామనవమి సందర్భంగా మూడు రోజుల పాటు తాళాలు తీసి భక్తులు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు ముగిసిన మరుసటి రోజే వాటికి మళ్లీ తాళాలు వేశారు. అప్పటి నుంచి వాటి తాళాలు తీయక భక్తులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది మహా శివరాత్రి సందర్భంగా ఆలయ పార్కింగ్ స్థలంలో దాదాపు రూ.5 లక్షలు వెచ్చించి మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించారు. మరో రూ. 10 లక్షలు వెచ్చించి స్నానాలకు, దుస్తులు మార్చుకునే గదులు వంటివి నిర్మించినప్పటికీ నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. దీంతో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదులు అందుబాటులో లేక అవస్థలు పడ్డారు. గురువారం నుంచి శ్రావణ మాసం వేడుకలు ప్రారంభమయ్యాయి. దీంతో పెద్ద ఎత్తున భక్తులు స్వామివారి దర్శనానికి తరలి రానున్నారు. వీరి ఇబ్బందులు తొలగించేందుకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. పార్కింగ్ స్థలంలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదుల నిర్వహణకు టెండర్లు పిలిచి అగ్రిమెంట్ చేసి గుత్తేదారుకు అప్పగించారు. దీంతో ఇవి అందుబాటులోకి రావడంతో భక్తులకు తిప్పలు తీరాయి.

నిర్వహణ ఇలా...ఆలయ పార్కింగ్ స్థలంలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు, స్నానాల గదుల నిర్వహణకు ఆలయ అధికారులు టెండర్లు పిలిచారు. రెండేళ్ల కాలపరిమితికి రూ. 3 లక్షలకు టెండర్లు పిలిచి అప్పగించారు. అందులో పైపులైన్లు, నల్లాలు తదితర చిన్న చిన్న మరమ్మతులను పూర్తి చేశారు. నీటి సరఫరా పైపులైను మరమ్మతులు చేయాల్సి ఉంది. అవి పూర్తి చేసి గుత్తేదారుకు అప్పగించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. నిర్వహణ ఛార్జీల కింద మరుగుదొడ్లు, మూత్రశాలలకు రూ. 5, స్నానాల గదులు ఉపయోగించుకునే వారి నుంచి రూ.10 వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే ఆది, సోమ, మంగళ, శుక్రవారాల్లో తప్పకుండా తెరిచి ఉంచాలని ఒప్పందంలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు ముందుగా వాహనాలతో పార్కింగ్ స్థలానికి చేరుకుంటారు.

# ఆశపెడతారు.. అందినకాడికి దోచేస్తారు

ఖమ్మం : పెట్టుబడి పెడితే లాభం వస్తుందని ఎస్ఎంఎస్ పంపగా బూర్గంపాడు మండలానికి చెందిన ఓ వ్యక్తి నమ్మారు. తన ఖాతా నుంచి రూ.10వేలు, రూ.20వేలు ఇలా విడతల వారీగా రూ.3.50 లక్షలు పంపించారు. తర్వాత సమాచారం రాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ఖమ్మం నగరానికి చెందిన ఒక మహిళ చరవాణికి ఎస్ఎంఎస్ వచ్చింది. వివరాలు నమోదు చేస్తే లాటరీ ద్వారా అత్యధిక నగదు బహుమతి పొందవచ్చునని నమ్మించారు. సదరు మహిళ లింక్‌పై క్లిక్ చేసి వ్యక్తిగత వివరాలు పొందుపరిచాక తొలుత రూ.10వేలను ఫలానా ఖాతాలో జమచేయాలని మరో ఎస్ఎంఎస్ వచ్చింది. నమ్మి రూ.10వేలు జమచేస్తే అవతలి వ్యక్తి నుంచి స్పందన లేదు. రోజురోజుకూ సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏమరుపాటుగా ఉంటే బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. పేద, ధనిక తేడా లేకుండా జనాలను ఉచ్చులో బిగించి ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ప్రచారం చేస్తున్నా సైబర్ నేరగాళ్లు కొత్తతరహా



మోసాలకు తెరలేపుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో నెలకు సగటున 30 కేసులు నమోదవుతుండటం కలవరపరుస్తోంది.

**అప్రమత్తతతో ఆట కట్టు**

స్మార్ట్‌ఫోన్ వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు చెలరేగుతున్నారు. కాస్త అప్రమత్తంగా ఉంటే మోసగాళ్ల ఆట కట్టించవచ్చునంటున్నారు పోలీసులు. సైబర్ క్రైం జరిగిందని తెలిసిన వెంటనే 1930 నంబరుకు ఫోన్‌చేస్తే ఏ బ్యాంకు ఖాతాలో డబ్బులు జమైతే ఆ ఖాతాను పోలీసులు నిలుపుదల చేస్తారు. బ్యాంకు ఖాతా వివరాలతో నేరస్థుణ్ని పట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. 1930 నంబరుకు డయల్ చేయడంతో పాటు సమీప ఠాణాలో ఫిర్యాదు పత్రం అందించాలి.

**ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా..**

సైబర్ క్రైం జరిగిన వెంటనే ఎన్‌సీఆర్‌పీ (నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్)లో వివరాలు నమోదు చేయాలి. అంతకుముందు ఈ పోర్టల్‌లో ఫోన్ నంబర్ సహాయంతో లాగిన్ కావాలి. ఐడీ నమోదవుతుంది. తర్వాత ఎప్పుడైనా, ఎక్కడైనా పోర్టల్‌లోనే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ క్రైం జరిగిన ప్రదేశం, సమీపంలోని పోలీస్‌స్టేషన్ వివరాలను పొందుపరచగానే సంబంధిత పోలీసులు తక్షణం స్పందిస్తారు. అంతేకాకుండా ఆడపిల్లలు, మహిళలు లైంగిక వేధింపులకు గురైనా ఈ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ప్రజల నుంచి సైబర్ క్రైం కేసు వివరాలు అందగానే చర్యలు తీసుకుంటున్నాం. జనం అప్రమత్తంగా ఉంటే చాలావరకు మోసాలను నివారించవచ్చు. ముఖ్యంగా ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేయటం, బ్యాంకు కస్టమర్ కేర్ నుంచి అని చెప్పి మాట్లాడే వారికి ఖాతా వివరాలు ఇవ్వటం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయటం, ఓటీపీలు ఇతరులకు చెప్పడం వల్ల మోసపోయే ఆస్కారముంది. శ్రావణ్, ఐటీ కోర్ ఎస్సై, కొత్తగూడెం

# ప్రభుత్వ జూనియర్ కళాశాలల నిర్వహణకు నిధులు

వరంగల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల రోజువారీ ఖర్చుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రతి విద్యార్థికి సగటున రూ.71 చొప్పున ఖర్చవుతాయని అంచనావేసి రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలకు నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. గతంలో కళాశాలల్లో చదివే విద్యార్థుల నుంచి రూ.500 చొప్పున రుసుము వసూలు చేసేవారు. ఈ సొమ్మును కళాశాలల నిర్వహణ ఖర్చులు.. అంటే సుద్దముక్కలు, బోర్డును శుభ్రం చేసే డస్టర్లు, రిజిస్టర్లు, తాగునీరందించే మోటార్లకు మరమ్మతు, చీపుర్లు, విద్యుత్తు బిల్లు తదితర అవసరాలకు ఖర్చు చేసేవారు. ఈ రుసుములను రద్దు చేయాలని, విద్యాసంస్థల నిర్వహణకు ఒక్కో విద్యార్థికి రూ.300 చొప్పున నిధులు అందజేయాలని అధ్యాపకులు ప్రభుత్వాన్ని కోరడంతో ఆమోదించింది. గతేడాది ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు




చేతికందలేదని పలువురు ప్రిన్సిపాళ్లు ఆరోపించారు.

**ఒక్కో విద్యార్థికి రూ.71**

పలు ప్రయోజనాలను గమనంలోకి తీసుకున్న ప్రభుత్వం వర్తమాన విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ రూ.71 చొప్పున మంజూరు చేసింది. అసలే ఇవ్వకపోవడం కంటే ఎంతో కొంత ఇవ్వడం నయమని ప్రిన్సిపాళ్లు అంటున్నారు. రోజు రోజుకూ ఖర్చులు పెరుగుతున్నాయని విద్యార్థులకు ఇచ్చే మొత్తాన్ని కనీసం రూ.500కు పెంచాలని వారు కోరుతున్నారు. రాష్ట్రంలో మొత్తం 408 ప్రభుత్వ జూనియర్ కళాశాలలుండగా 1,38,450 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు చదువుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 49 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి.

**ప్రిన్సిపాళ్లు ఏమంటున్నారంటే..?**

గతంలో కూడా ఇలాగే నిధులు ఇచ్చి చేతిలో పడకుండా చేశారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు ఏ మూలకూ సరిపోవు. ఈ మొత్తాన్ని కనీసం రూ.500కు పెంచాలి. విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే ప్రిన్సిపాళ్ల ఖాతాలో జమ చేయాలి. నిధుల విడుదలకు పెట్టిన పలు నిబంధనలను సరళీకరించాలి. చాలా మంది తమ సొంత డబ్బులను ఖర్చు చేస్తున్నారు. విధానాలు మార్చాలి. అన్ని వస్తువుల ధరలు పెరిగాయి. అందుకనుగుణంగా ఈ మొత్తాలను కూడా పెంచాలి.

# మనోళ్లైతే పక్కా.. కాకుంటే మరోలెక్క..!



ఖమ్మం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల్లో బీసీ కులవృత్తులకు ఆర్థిక సాయం మంజూరు ప్రక్రియ అధికార పార్టీ షాడో నాయకుల కనుసన్నల్లో సాగుతోంది. పురపాలికల్లో వార్డుకు ఇద్దరు చొప్పున ఎంపిక చేసిన లబ్ధిదారులు స్థానిక ప్రజాప్రతినిధుల బంధువులు కావటం గమనార్హం. మిగతా మండలాల్లో ఒక్కో లబ్ధిదారు నుంచి రూ.15వేలు- 25వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బులు ముట్టజెప్పిన తర్వాతే చెక్కులు అందిస్తున్నారని సమాచారం. ఖమ్మం జిల్లాలోని ఓ నియోజకవర్గంలో స్థానిక ప్రజాప్రతినిధులే పైరవీకారుల అవతారమెత్తారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఈ తతంగాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఒక్కొక్కరికి 10-20 మంది లబ్ధిదారులను కేటాయించి డబ్బులు వసూలు చేసుకోవాలని చెప్పినట్లు తెలిసింది.

బీసీ కులవృత్తులకు పునరుజ్జీవం కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేస్తోంది. ఆర్థికంగా స్తోమత లేని చేతి, కులవృత్తిదారులకు దన్నుగా నిలవాల్సిన సర్కారు సాయం.. పలుచోట్ల దళారుల పాలవుతోంది. ముఖ్యనేతల అనుచరులే దళారుల అవతారమెత్తారు. కొన్నిచోట్ల ఒక్కో లబ్ధిదారు నుంచి ఏకంగా రూ.25వేల వరకు వసూలు చేస్తున్నారు.

**అనుచరులకే పెద్దపీట..**

ప్రభుత్వ సాయం పంపిణీలో వసూళ్ల పర్వం ఒక ఎత్తైతే.. కొన్ని నియోజకవర్గాల్లో అర్హులను పక్కనబెట్టి కొంతమంది ప్రజాప్రతినిధులు తమ అనుచరులు, కార్యకర్తలను ఎంపిక చేశారనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఖరీదైన కార్లు, ఇళ్లు ఉన్నవారికి లబ్ధిదారుల జాబితాలో చోటుదక్కిందని తెలుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కొందరు ప్రజాప్రతినిధుల కుటుంబీకులు, బంధువులు లబ్ధిదారులు కావటం చర్చనీయాంశంగా మారింది. మరో నియోజకవర్గంలో ఏకంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనే కొంతమంది నేతలు లబ్ధిదారుల నుంచి వసూళ్ల పర్వానికి తెరలేపడం గమనార్హం. గ్రామాల్లోనూ లబ్ధిదారుల ఎంపికలో స్థానిక ప్రజాప్రతినిధులు విచ్చలవిడిగా వసూళ్లకు దిగుతున్నారని సమాచారం.

**చోటా నాయకులకు పండగ**

బీసీ కులవృత్తుల ఆర్థిక సాయానికి భారీగా దరఖాస్తులు అందాయి. ఖమ్మం జిల్లాలో 13,820 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 13,675 మందిని అర్హులుగా అధికారులు తేల్చారు. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 300 మందికి సాయమందించాలన్నది సర్కారు ఉద్దేశం. ప్రభుత్వం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరించింది. రెవెన్యూ, పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించిన తర్వాత లబ్ధిదారులను ఎంపిక చేయాలి. అయితే లబ్ధిదారుల ఎంపికలో స్థానిక ప్రజాప్రతినిధులు అన్నీ తామై వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. తమ బంధువులు, అనుకూలమైన కార్యకర్తలకే పెద్దపీట వేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా నియోజకవర్గాల్లో చోటామోటా నాయకులే కాదు కొందరు ప్రజాప్రతినిధులూ దళారులుగా మారారు. ఎంపికైన లబ్ధిదారుల నుంచి రూ.15వేల నుంచి రూ.25వేల చొప్పున వసూళ్లకు పాల్పడుతున్నారు. రూ.లక్ష చెక్కు చేతికందుతున్నా.. పావు వంతు మొత్తాన్ని నేతలకు ముట్టజెప్పాల్సి రావడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. బీసీ కులవృత్తులకు ఆర్థిక సాయం పంపిణీలో దళారులు జోక్యం చేసుకుంటున్నారనే అంశం మా దృష్టికి రాలేదు. ఫిర్యాదులు అందితే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. జ్యోతి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి, ఖమ్మం

# ఫలితాల్లో పదిమెట్లు పైకి ఎక్కేలా!



కొత్తగూడెం : పదో తరగతి విద్యార్థులను వచ్చే వార్షిక పరీక్షల ఫలితాల్లో పదిమెట్లు పైకెక్కించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ప్రాథమిక స్థాయిలో అమలు చేస్తున్న 'తొలిమెట్టు' ఫలితాలను ఆదర్శంగా తీసుకుని.. రాష్ట్ర విద్య, పరిశోధన శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్టీ) ఆధ్వర్యంలో 'లక్ష్య' అనే కార్యక్రమాన్ని రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే ప్రణాళిక, ఒకే బోధన, ఒకేరీతి సాధనకు చర్యలు తీసుకుంటోంది. వివిధ యాజమాన్యాల పాఠశాలల్లో వేర్వేరు ప్రణాళికల్లేకుండా, కేవలం పరీక్షలను దృష్టిలో పెట్టుకొని తరగతుల నిర్వహణ, సన్నద్ధతకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసిన ప్రధానోపాధ్యాయులకు ఈనెల 9 నుంచి 11 వరకు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వారు జిల్లాస్థాయిలో అన్నిరకాల యాజమాన్యాల హెచ్.ఎం.లకు ఈ నెల 21 నుంచి మూడ్రోజుల పాటు తర్ఫీదు ఇవ్వనున్నారు. ఎంపిక చేసిన సబ్జెక్టు ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయిలో త్వరలో శిక్షణ నిర్వహించనున్నారు. అక్కడ నేర్చుకున్న అంశాలను తిగిరి ఈ నెల 22 నుంచి జిల్లా స్థాయిలో టీచర్లకు వివరించనున్నారు.

**విద్యార్థుల సన్నద్ధత ఇలా..**

ఏడాదంతా ఒకే లక్ష్యంతో సన్నద్ధత కొనసాగుతుంది. సబ్జెక్టు వారీగా బోధన, సాధనకు పీరియడ్లు కేటాయిస్తారు. సాధన తర్వాత లఘు ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. ఇలా ప్రతి సబ్జెక్టుపై 10 నుంచి 15 సార్లు పరీక్షలు జరుగుతాయి. వీటితో పాటు సంగ్రహణాత్మక పరీక్షలు(సమ్మేటివ్ అసెస్‌మెంట్-1), 50 శాతం సిలబస్‌తో ఒకసారి, మిగిలిన సగం సిలబస్‌కు ప్రీ ఫైనల్ పరీక్షలుంటాయి. పక్కా ప్రణాళిక కోసం ఉపాధ్యాయులకు కరదీపికలు అందజేస్తారు. 'టీ-శాట్' ఛానల్‌లో పాఠ్యాంశాలపై కార్యక్రమాలు వీక్షించే ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులను ప్రతిభ ఆధారంగా మూడు విభాగాలు(ఫెర్మార్మెన్స్, పూర్ ఫెర్మామెన్స్, టీచర్ సపోర్ట్ (గ్రూప్)గా విభజిస్తారు. వారి స్థాయికి అనుగుణంగా బోధిస్తారు. నవంబరు నుంచి ఉదయం, సాయంత్రం ఏదో ఒక సెషన్ ప్రత్యేక తరగతులుంటాయి. జనవరి నుంచి రెండు పూటలు కొనసాగిస్తారు. కెరీర్ గైడెన్స్, కౌన్సెలింగ్ ఉంటాయి. జనవరి 10లోపు సిలబస్ పూర్తిచేయాలి. ఆ తర్వాత పరీక్షలకు సన్నద్ధపరచాలి. మండల స్థాయిలో ఎంఈఓ, నోడల్ అధికారి పాఠశాలల వారీగా 'లక్ష్య' అమలు తీరును పరిశీలిస్తారు. జిల్లా స్థాయి బృందం నెలకు కనీసం అయిదు పాఠశాలలను సందర్శించి కార్యక్రమ పురోగతిని అంచనా వేస్తుంది. రాష్ట్ర బృందాలు నెలలో కనీసం ఒక జిల్లాను సందర్శిస్తాయి.

విద్యార్థులకు ఏ పీరియడ్‌లో ఏ పాఠ్యాంశం బోధించాలి? ఆ తర్వాత నేర్చుకున్న అంశాలపై ఎంత సేపు సాధన చేయించాలో ఉపాధ్యాయులకు 'లక్ష్య' కార్యక్రమంలో పూర్తి అవగాహన కల్పిస్తున్నాం. ఆ తర్వాత ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకునేందుకు కరదీపికలు అందజేస్తాం. దశల వారీగా సబ్జెక్టు టీచర్ల శిక్షణలుంటాయి. లఘు ప్రశ్నలతో నిర్వహించే పరీక్షలపై అవగాహన కల్పిస్తాం. విద్యార్థులకు అభ్యసన దీపికలు అందిస్తాం. గత ఫలితాలకు మించి సంతృప్తికరమైన స్థాయిలో ఉత్తీర్ణత సాధించడమే అందరి లక్ష్యం. నాగరాజశేఖర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

# సరకుల సరఫరాలో.. గిమ్మిక్కు

ఖమ్మం : కొన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో తప్పుడు హాజర్లతో బిల్లులు నొక్కేస్తున్న వైనం తెలిసిందే. దీనికి తోడు కొందరు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గోదాముల అధికారులతో కుమ్మక్కవుతున్న హెచ్.ఎం.లు, వార్డెన్లు.. వంట సరకులు పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చాలా ఆశ్రమ పాఠశాలల్లో నిబంధనలు పాటిస్తున్నా, కొన్నిచోట్ల మాత్రం అవినీతి జరుగుతోంది. ఆయా పాఠశాలలపై సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉన్నతాధికారులు దృష్టిసారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**తప్పుడు లెక్కలతో..:**

జీసీసీ గోదాముల ద్వారా వాటి పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలకు ప్రతినెలా బియ్యం, వంట సరకులు సరఫరా చేస్తుంటారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా హెచ్.ఎం.లు, వార్డెన్లు లెక్కలు వేసుకుని వెళ్లి.. కావాల్సిన సరకుల గురించి గోదాముల వద్ద అధికారులను కలుస్తారు. గత నెలలో సరఫరా చేసిన వాటిల్లో ఏమైనా మిగిలితే, అవి పోను మిగతా వాటిని తెచ్చుకోవాలి. కానీ కొందరు హెచ్‌ఎంలు, వార్డెన్లు సరకులేవీ మిగలడం లేదని లెక్కలు చూపుతున్నారు. మిగులుతున్న మేర సరకులను గోదాముల్లోనే నిల్వ చేసుకుని, అక్కడి అధికారుల సహకారంతో సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గోదాముల నిర్వాహకులు కంప్యూటర్ బిల్లులకు బదులు రసీదులు చేతితో రాసి ఏ సంతకాలు, శాఖ ముద్రలు లేకుండా పాఠశాలలకు పంపిస్తున్నారు. మిగుల్చుకున్న సరకులు విక్రయించగా వచ్చే మొత్తాన్ని




గోదాముల అధికారులు 60 శాతం, హెచ్.ఎం.లు, వార్డెన్లు కలిపి 40 శాతం పంచుకుంటున్నారని సమాచారం. ఇటీవల ఇల్లెందు నియోజకవర్గంలోని ఓ వసతిగృహంలో చోటుచేసుకున్న అవకతవకలు బయటకు పొక్కగా, ఈ విషయం ఉన్నతాధికారుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. గిరిజన ఆశ్రమ పాఠశాలలకు సరుకులు పంపే క్రమంలో కంప్యూటరు బిల్లులు ఇవ్వాలని జీసీసీ అధికారులకు సూచించాం. కానీ వారు చేతిరాత బిల్లులే ఇస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలకు వంట సరకులు పంపే విషయంలో ఎలాంటి అవినీతి జరగడం లేదు. ఏమైనా అక్రమాలపై ఫిర్యాదులొస్తే విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. రూపాదేవి, ఏటీడీఓ

# లీకేజీ ఆగదు.. మురుగు తగ్గదు..

వరంగల్ : వరంగల్ శివనగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి కింద అన్ని కాలాల్లోనూ లీకేజీ నీళ్లు నిలుస్తుండడంతో వాహనదారులు, నడుచుకుంటూ వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు మార్గాలున్న అండర్‌బ్రిడ్జి పాత దారిలో పైప్‌లైన్ లీకేజీతో నిత్యం నీళు నిలిచి పాకర పట్టి వాహనాలు జారుతున్నాయి. వాహనాలు వెళ్లేటప్పుడు నీళ్లు కాలినడకన వెళ్లేవారిపై పడి దుస్తులు పాడవుతున్నాయి. కొత్తగా వేసిన బ్రిడ్జి కింద పైనుంచి వచ్చే మురుగు నీరు ప్రవహిస్తోంది. ఒక బ్రిడ్జి కింద లీకేజీ నీరు, మరో బ్రిడ్జి కింద మురుగు నీరుతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నుంచి దుర్గంధం వస్తుండటంతో ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోంది. ఈ బ్రిడ్జి కింది నుంచే శివనగర్, పెరుకవాడ, ఉర్సు, కరీమాబాద్, రంగశాయిపేట, ఖిలావరంగల్, చింతల్, పుప్పాలగుట్ట, మైసయ్యనగర్, ఏకశిలానగర్, విద్యానగర్ కాలనీ, శంభునిపేట, గిరిప్రసాద్



నగర్‌తోపాటు, మామునూర్, నెక్కొండ, తొర్రూర్ తదితర ప్రాంతాలకు వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎప్పుడూ రద్దీగా ఉండే దారిలో సమస్యను బల్దియా అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

**దుస్తులు పాడవుతున్నాయి..** – గోరంటల శరత్‌బాబు, శివనగర్

అండర్ బ్రిడ్జి కింద లీకేజీ, మురుగు నీరు నిలుస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ దారిలో కళాశాలలకు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థినులపై మురుగు నీరు పడుతుండటంతో దుస్తులు పాడవుతున్నాయి. బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇదే దారి నుంచి వెళ్తున్నా సమస్యను పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికైనా స్పందించి బ్రిడ్జి కింద నీరు లేకుండా చర్యలు చేపట్టాలి.

# విద్యాకేంద్రం.. ఆవిష్కరణలకు ఊతం

వరంగల్: వరంగల్ విద్యా కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. ఇప్పుడా విద్యా సంస్థలు మేటి పరిశోధనలు చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నాయి. ఎన్నో కొత్త ఆవిష్కరణలకు కేంద్ర బిందువులుగా మారుతున్నాయి. సరికొత్త ప్రయోగాలు చేస్తూ శాస్త్రవిజ్ఞానంతో మేధో హక్కులు సొంతం చేసుకుంటూ ఓరుగల్లు పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలబెడుతున్నాయి. భవిష్యత్తు సాంకేతిక భారతానికి మన దగ్గర నుంచి బంగారు బాటలు పరచుకుంటున్నాయి. కొత్త ఆవిష్కరణలు చేయడమే కాకుండా వాటికి మేధో హక్కులు పొందేందుకు ఇక్కడి విద్యా సంస్థల్లో తగిన ప్రోత్సాహం లభిస్తోంది. మన దగ్గర గుణాత్మకమైన ఆవిష్కరణలు జరుగుతున్నందున కేంద్ర శాస్త్రసాంకేతిక విభాగం (డీఎస్టీ) రూ. కోట్ల విలువైన ప్రాజెక్టులను మంజూరు చేస్తోంది. దీనిపై ప్రత్యేక కథనం.

**కృత్రిమ మేధపై ఎన్నో**

వరంగల్ జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (నిట్)లో పరిశోధనల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. డీఎస్టీ నుంచి అన్ని విభాగాల అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులకు ప్రాజెక్టులు మంజూరవుతున్నాయి. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఈసీఈ, కంప్యూటర్ సైన్స్, కెమికల్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ విభాగాలకు ప్రతి సంవత్సరం కనీసం అయిదు పేటెంట్లు దక్కుతున్నాయి. ఇటీవల కృత్రిమ మేధపై నిట్లో అనేక ప్రాజెక్టులకు భారత్ సహా, ఆస్ట్రేలియా, అమెరికా, ఆఫ్రికా దేశాల పేటెంట్లు వస్తున్నాయి. 'ఏఐ' (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) పరిజ్ఞానంతో చేస్తున్న ఒక ప్రాజెక్టుకు ఏకంగా రూ.2 కోట్ల నిధులు దక్కనున్నాయని ఆచార్యులు చెబుతున్నారు.

**ముచ్చటగా మూడు**

ఈసీఈ విభాగం ఆచార్యులు టి.కిశోర్‌కుమార్ కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంతో ముడిపడి ఉన్న మూడు ప్రాజెక్టులపై పనిచేస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మధుమేహం వ్యాధిగ్రస్థులు రోజురోజుకు పెరుగుతున్నారు. ఈ నేపథ్యంలో 'ఏఐ' తో ముడిపడ్డ ప్రాజెక్టుకు ఆయన నేతృత్వం వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. మధుమేహ బాధితులు ఏదైనా ఆహారం తింటే అది వారికి సరిపోయిందా లేదా ఎక్కువ క్యాలరీలు వచ్చాయా? తిన్న ఆహారం వల్ల ఏదైనా హాని కలుగుతుందా అని అప్పటికప్పుడు సూచనలు అందడమే కాక, ఏ మేరకు తినాలని చెప్పే సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. అమెరికాతో కలిసి ప్రాజెక్టును చేపట్టనున్నామని కిశోర్‌కుమార్ వివరించారు. వీటితోపాటు పుట్టుకతోనే జన్యు వ్యాధులకు గురయ్యే పిల్లల కోసం, మోకీళ్ల నొప్పులతో బాధపడే వారి కోసం మరో రెండు కృత్రిమ మేధ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి.

**ప్రైవేటులోనూ..**

ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సైతం తమ విద్యార్థుల కోసం ఇన్నోవేషన్ కేంద్రాలను నెలకొల్పుతున్నాయి. హనుమకొండలోని కిట్స్ కళాశాలలో ఇటీవల మానవ రహిత ట్రాక్టర్‌ను అధ్యాపకులు, విద్యార్థులు కలిసి రూపొందించారు. ఇక్కడ ఇన్నోవేషన్ కేంద్రం ఏర్పాటుచేసి విద్యార్థుల ఆవిష్కరణలకు తగిన వసతులు కల్పించారు.

వరంగల్ ఎస్.ఆర్ వర్సిటీలో ఇన్నోవేషన్ కేంద్రం ఏర్పాటుచేసి అక్కడ అంకురాలను ప్రోత్సహిస్తూ పరిశోధకులకు సీడ్ ఫండింగ్ చేస్తున్నారు. పరిశోధనల స్థాయి పెంచేందుకు అనేక ఎంవోయూలు చేసుకుంటున్నారు. ఇటీవల డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకొంది. రీసెర్చ్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, హ్యాకథాన్లు, శిక్షణ కార్యక్రమాలకు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించుకున్నారు.

**కే-హబ్‌లో మేటి ప్రయోగాలు** – ఆచార్య తాటికొండ రమేశ్, ఉపకులపతి, కేయూ

కేయూలో పరిశోధనల స్థాయి పెంచేందుకు ఇప్పటికే టీఎస్‌కాస్ట్ పేటెంట్ సెల్‌తో ఒప్పందం కుదిరింది. క్యాంపస్‌లో అత్యాధునిక హంగులతో రూ.1.5 కోట్లతో 'కే-హబ్' నిర్మించాం. ఇందులో లైఫ్ సైన్సెస్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ సైన్సెస్, ఇంజినీరింగ్ రంగాల్లో విస్తృత పరిశోధనలు చేసేందుకు ఈ కేంద్రం కృషి చేస్తోంది. పేటెంట్లను ప్రోత్సహించేందుకు ఇందులో వసతులు కల్పిస్తున్నాం.

**మేధో హక్కులను ప్రోత్సహిస్తున్నాం** – నటేశన్, ప్రాజెక్టు అసోసియేట్, పేటెంట్ సెల్, వరంగల్

పేటెంట్ సెల్‌ను వరంగల్ ప్రాంతీయ సైన్స్ కేంద్రంలో ఏర్పాటుచేశాం. ఇందులో ప్రత్యేకంగా సిబ్బంది పనిచేస్తున్నారు. ఉమ్మడి వరంగల్‌లో మూడు సంస్థలతో ఒప్పందం కుదిరింది. వాటికి రూ.50 వేల చొప్పున నిధులు అందించాం. పరిశోధనలను ప్రోత్సహించాలన్నదే మా సెల్ లక్ష్యం.

# వీధి కుక్క.. పెరుగుతున్న లెక్క!

మహబూబాబాద్ :ఓరుగల్లు నగరంలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. నగరవాసులకు ఐదారు నెలలుగా నిత్యం కుక్క కాట్లు తప్పడం లేదు. ఇటీవల రెడ్డికాలనీలో ఒకటే రెండున్నర గంటల్లో 36 మందిపై దాడికి తెగబడడం పరిస్థితి తీవ్రతను చెబుతోంది. ఈ క్రమంలో పిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్డు మీదకు రావడానికి భయపడుతున్నారు.

ఎక్కువగా సంచరించే ప్రాంతాలు

నగరంలోని రామన్నపేట పెద్దమోరీ, పాపయ్యపేట, ఓఎస్‌నగర్, రఘునాథ్ కాలనీ, పోతననగర్, రంగంపేట, కొత్తవాడ, దేశాయిపేట, ఎల్బీనగర్, కాశీబుగ్గ, లేబర్ కాలనీ, అబ్బనికుంట, గిర్మాజిపేట, మట్టెవాడ, ఖిలావరంగల్ కోట, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, ఎస్‌ఆర్‌ఆర్‌తోట, శాంతినగర్, పెరుకవాడ, శివనగర్ ప్రాంతాల్లో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయి.

తిమ్మాపూర్, మామునూరు, వసంతపూర్, దూపకుంట, బొల్లికుంట, సింగారం, నక్కలపల్లి, రాంగోపాలపూర్, ధర్మారం, గొర్రెకుంట, ఆరెపల్లి, పైడిపల్లి విలీన గ్రామాల్లో కుక్క కాట్లు తప్పడం లేదు.

రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, శివనగర్, సీకేఎం ఆసుపత్రి గల్లీ, ఎల్లమ్మబజారు, మండిబజారు, దేశాయిపేట, పాపయ్యపేట ప్రాంతాల్లోని చికెన్ దుకాణాల వద్ద ఎక్కువగా పోగవుతున్నాయి.

మాంసం వ్యర్థాలతోనే..



వీధి కుక్కలు పెరగడానికి చాలా కారణాలున్నాయని నిపుణులు తేల్చారు. విచ్చల విడిగా మాంసం, చికెన్ వ్యర్థాలు, రెస్టారెంట్లు, హోటళ్లలో మిగిలిపోయిన ఆహారాన్ని పడేస్తుండటంతో వాటికి సరిపడా ఆహారం లభిస్తోంది.. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో చికెన్, మటన్ వ్యాపారులు వ్యర్థాలను డ్రైనేజీల్లో పడేస్తున్నారు. అమ్మకాల దుకాణాల ముందు పెద్ద సంఖ్యలో గుంపులు సంచరిస్తున్నాయి. విలీన గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మిగిలిన ఆహారాన్ని డంపర్, కంపాక్టర్ బిన్లు, రహదారుల్లో డంపు చేస్తున్నారు. ఇలాంటి దగ్గర అవి ఎక్కువగా తిరుగుతున్నాయి.

చికెన్, మటన్ వ్యర్థాలు, ఆహారాన్ని బయట వేయకుండా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

మీకు తెలుసా..వరంగల్ నగరంలోని 66 డివిజన్లలో 19 వేల వీధి కుక్కలున్నాయని ప్రజారోగ్య విభాగం పరిశీలనలో తేలింది. ఇందులో 7 వేల కుక్కలు చర్మ వ్యాధుల బారిన పడినట్లుగా గుర్తించారు.

ఇదీ పరిస్థితి..జంతు సంరక్షణ చట్టం ప్రకారం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స ద్వారా వీధి కుక్కల సంతానోత్పత్తిని నిలువరించాలని పురపాలక శాఖ ఉత్తర్వులు చెబుతున్నాయి. ఈ క్రమంలో నగరంలో వాటిని పట్టుకునేందుకు మూడు బృందాలు, 12 మంది సిబ్బంది, మూడు వాహనాలున్నాయి. ఐదేళ్లుగా గ్రేటర్ పరిధిలో వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. చింతగట్టు ఎస్సారెస్పీ క్యాంపులో ఆపరేషన్ థియేటర్, డాగ్స్ వెయిటింగ్ హాల్ ఉంది. ఇప్పటి వరకు 10 వేల కుక్కలకు శస్త్ర చికిత్స చేసినట్లుగా లెక్కలు చెబుతున్నాయి. చింతగట్టు ఆపరేషన్ థియేటర్‌లో ప్రస్తుతం రోజూ సగటున 30 శునకాలకు శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు 900, ఏడాదికి 10 వేలు వరకు కు.ని చికిత్సలు చేస్తున్నారు. 66 డివిజన్లలో ఇంకా శస్త్రచికిత్స చేయని 9 వేల కుక్కలకు ఈ లెక్కన కు.ని. చికిత్స పూర్తవ్వాలంటే మరో ఐదేళ్ల సమయం పడుతుందని అంచనా. ఈ సమయంలో వీధి కుక్కలు వందల సంఖ్యలో పిల్లలను కంటాయి.. వాటి పరిస్థితి ఏమిటనేది అర్థం కాని విషయం.

నిపుణుల సలహాలు పాటిస్తాం-డాక్టర్ రాజేష్, ముఖ్యఆరోగ్యాధికారి గ్రేటర్ వరంగల్‌వీధి కుక్కల నివారణ చర్యలు వేగవంతం చేశాం. చర్మ వ్యాధులున్న కుక్కలను పట్టుకొని ఐదు దఫాలుగా డోస్‌లు ఇస్తాం. కు.ని. ఆపరేషన్లు పెంచేందుకు ఆలోచన చేస్తున్నాం. చికెన్, మటన్ వ్యర్థాలు, ఆహార పదార్థాలు బయట పడేయకుండా వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తాం. నిపుణుల కమిటీ సలహాలు అమలు చేస్తాం.ఫిర్యాదు చేయొచ్చు.. బల్దియా టోల్ ఫ్రీ నంబరు 1800 425 1980చింతగట్టు డాగ్ హౌజ్ ఇన్‌ఛార్జి భాషానాయక్ సెల్ నంబరు 7893863204బల్దియా పశువైద్యాధికారి డాక్టర్ గోపాల్‌రావు, 9701999701ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజేష్, 9701999689

# ఆదాయమంతా జీతభత్యాలకే!

మల్యాల : జిల్లాలో ధాన్యం దిగుబడులు విపరీతంగా పెరగడంతో ఏటా ఐకేపీ, సింగిల్విండోల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా సమకూరే కమీషన్ ఆదాయం కార్యాలయాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలకే ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో 51 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలుండగా వాటిలో కొన్ని సింగిల్విండోలు మాత్రమే ధాన్యం కొనుగోలు ద్వారా లాభాల బాటలో పయనిస్తుండగా మిగిలినవాటి ఆదాయమంతా జీతభత్యాలకే ఖర్చవుతున్నాయి. మల్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా దాని పరిధిలోని ఐదు గ్రామాల్లో ఏటా దాదాపు లక్ష క్వింటాళ్లకుపైగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు రూ.32 చొప్పున దాదాపు రూ.35 లక్షల ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ ప్రతి సంవత్సరం కార్యాలయంలో పనిచేసే సీఈవో, కంప్యూటర్ ఆపరేటర్, క్లర్కు, సేల్స్ మేనేజరు వేతనాలకు రూ.10 లక్షలు, ఏటా రెండు సీజన్లలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది, నిర్వహణ ఖర్చుల కింద రూ.12.50 లక్షల ఖర్చు చేస్తున్నారు.సింగిల్విండో ద్వారా రైతులకు ఎరువులు, వరి విత్తనాలు విక్రయిస్తున్నా పెద్దగా లాభాలు పొందడంలేదు. మల్యాల సింగిల్విండో పరిధిలో కొండగట్టు, మల్యాల అడ్డరోడ్డు, బల్వంతాపూర్, సర్వాపూర్, మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 2010 నుంచి ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళు ప్రారంభించింది. ఐదేళ్ల నుంచి ధాన్యం దిగుమతి విపరీతంగా పెరగడంతో ఒక్కో సింగిల్విండోకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. సిబ్బంది వేతనాలకే 90 శాతం నిధులు వెచ్చిస్తుండగా మిగిలిన డబ్బులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పాలకవర్గాలు పేర్కొంటున్నాయి. మల్యాలలోని సింగిల్విండో ఖాతాలో ప్రస్తుతం రూ.22 లక్షలు మాత్రమే ఉన్నాయని, వాటితో నూతనంగా రూ.40 లక్షల అంచనా వ్యయంతో లాకర్ గది సౌకర్యంతో కార్యాలయ భవన నిర్మాణం చేపట్టినట్లు సీఈవో గోవర్ధన్ తెలిపారు. ఏటా తమ సింగిల్విండోలో రూ.10 కోట్ల టర్నోవర్ ఉంటుందని వివరించారు.

# రోడ్ల నిర్మాణం.. వైవిధ్యభరితం



ఖమ్మం : ఆదివాసీల అవస్థల ప్రయాణానికి తెరపడనుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల మంజూరుచేసిన నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధులతో అధునాతన పద్ధతుల్లో బీటీ రహదారులు ఏర్పాటుకానున్నాయి. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వీటికి అనుమతులు లభించాయి. గుత్తేదారులు వారంలో పనులు ప్రారంభించేలా ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాలో బీటీ రోడ్లు మంజూరైన ప్రాంతాలు పినపాక మండలం భూపతిరావుపేట నుంచి వలస ఆదివాసీ గ్రామం సుందరయ్యనగర్‌కు రూ.2 కోట్లతో రెండు కి.మీ. రహదారి నిర్మించనున్నారు.

చర్ల మండలం రామానుజపురం నుంచి గోదావరి నది వరకు 2 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.2కోట్లు, సుందరయ్యనగర్ నుంచి వీరాపురం కాలనీ వరకు 2.5 కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. ఆళ్లపల్లి మండలంలో ప్రధాన రహదారి నుంచి రాఘవపురం వరకు, దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం నుంచి లక్ష్మీపురం వరకు రూ.20 కోట్లతో సుమారు 20 కి.మీ. రోడ్డును ఏర్పాటు చేయనున్నారు.

అధునాతన పద్ధతుల్లో.. పినపాక మండలం భూపతిరావుపేట నుంచి సుందరయ్యనగర్ వరకు రహదారి నిర్మాణానికి ప్రత్యేక పద్ధతులు అవలంబిస్తున్నారు. ముందుగా రహదారిపై 70 శాతం గ్రావెల్, 30 శాతం జీఎస్పీ మిశ్రమాన్ని పరుస్తారు. మొదటి దశలో భాగంగా ఒక క్యూబిక్ మీటరు మిశ్రమానికి 40 కిలోల సిమెంట్‌ను కలుపుతారు. ఈ మిశ్రమం అంతా కలిసేలా రోటావేటర్‌తో చదును చేస్తారు. రెండోదశలో ఒక క్యూబిక్ మీటరు గ్రావెల్, జీఎస్పీ మిశ్రమానికి 60 కిలోల సిమెంటు కలిపి చదును చేస్తారు. మూడో దశలో బీటీ పోయటంతో రహదారి నిర్మాణం పూర్తవుతుంది.

దుమ్ముగూడెం మండలంలో సుమారు 20 కి.మీ. రహదారి నిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాల మిశ్రమాన్ని వినియోగించనున్నారు. రహదారి మన్నిక ఏళ్ల తరబడి చెక్కు చెదరకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఆళ్లపల్లి, చర్ల మండలాల్లో ప్రత్యేక రసాయనం (టెర్రాజైం)తో బీటీ రోడ్లు నిర్మించనున్నారు. ఈ రహదారుల మన్నిక చాలాకాలం ఉంటుంది.

ప్రత్యేక ప్రమాణాలు పాటిస్తూ బీటీ రహదారులు నిర్మించటం జిల్లాలో ఇదే మొదటిసారి. గతంలో ఏర్పాటు చేసిన వాటికి భిన్నంగా ఈరోడ్లు ఉంటాయి.రాంబాబు,ఏఈ, ఆర్‌అండ్‌బీ

# ఏమరుపాటు.. ప్రాణాలకు చేటు



ఖమ్మం :విద్యుత్తు తీగ మృత్యుపాశమవుతోంది. క్షణకాల నిర్లక్ష్యంతో ఎంతోమంది ప్రాణాలు బలిగొంటోంది. మరెందరో వైకల్యం బారిన పడుతున్నారు. తెగి పడిన తీగలు, పంటలను కాపాడేందుకు పెట్టే రక్షణ కంచెలు, వ్యవసాయ విద్యుత్తు మోటార్లు, నియంత్రికల ఎర్తులు వంటివి ఉసురు తీస్తున్నాయి. అకాల వర్షాల కారణంగా జిల్లాలో ఇటీవల పలు సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్తు ప్రమాదాలపై సిబ్బందిని, ప్రజలను చైతన్య పరిచేందుకు విద్యుత్తు శాఖ ఏటా మే ఒకటి నుంచి వారం రోజులపాటు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 11 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సుమారు 1.6 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. జోరుగా గాలి వీచినప్పుడు, వర్షాకాలంలో తీగలు తెగడం, పంటకు రక్షణగా కంచెకు విద్యుత్తు పెట్టడం, జంతువులను, చేపలను వేటాడేందుకు ఏర్పాటు చేసిన తీగలు తగలినప్పుడు ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఉప కేంద్రాల్లో అరకొరగా సిబ్బంది ఉండటంతో వేలాడే, తెగిన విద్యుత్తు తీగలను గుర్తించడం ఆలస్యమవుతోంది.పరిహారం పొందొచ్చు...విద్యుత్తు ప్రమాదాలతో మృతి చెందిన కుటుంబాలకు సంస్థ పరిహారం అందిస్తుంది. అయితే ఘటన ఆ శాఖ నిర్లక్ష్యం వల్ల జరిగిందని తేలితేనే పరిహారం మంజూరవుతుంది. వ్యక్తి మృతి చెందితే రూ.5 లక్షలు, పశువులకు రూ.40 వేలు, గొర్రెలు, మేకలకు కూడా పరిహారం అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు స్టేషన్‌లో, విద్యుత్తు శాఖ అధికారులకు తెలియజేయాలి. ఎఫ్ఐఆర్, పంచనామా ధ్రువీకరణ పత్రాలను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలి.

జాగ్రత్తలు... విద్యుత్తు సరఫరా చేసే పరికరాలను అమర్చుకోవడంలో నిర్లక్ష్యం వహించకూడదు. ప్లాస్టిక్ స్టార్టర్ బాక్సులు ఏర్పాటు చేసుకోవాలి. ఎర్తింగ్ తప్పనిసరి.

వర్షాలు పడినప్పుడు తెగిపడిన విద్యుత్తు తీగలు, విరిగిన స్తంభాలను ముట్టుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలి.

వేలాడుతున్న తీగల గురించి అధికారులకు తెలియజేయాలి.

అనుమతి లేకుండా నియంత్రికల పైకి ఎక్కి తీగలు సరి చేయడం, మరమ్మతు చేయడం, సర్వీసు వైర్లు మార్చకూడదు.

వ్యవసాయ పంపుసెట్ల వద్ద సర్వీసు, ఎర్త్ వైర్లు మంచి నాణ్యమైన ఇన్సులేషన్ ఉన్నవి వినియోగించాలి. పొలం కంచెకు స్టే వైర్లు, ఎర్త్ వైర్లు తగలకుండా చూసుకోవాలి.

ఫ్యూజులు, స్టార్టర్ బోర్డులు నేలకు 5 అడుగుల ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేయాలి.

ఫ్యూజు కాలిపోతే నేరుగా కనెక్షను ఇవ్వకూడదు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కొత్త ఫ్యూజు అమర్చుకోవాలి.

దుస్తులు ఆరేసేందుకు ఉపయోగించే దండెంగా తాడును, ఇన్సులేషన్ ఉన్న తీగను ఉపయోగించాలి. విద్యుత్తు తీగలకు దగ్గరగా కట్టకూడదు.

ఎవరికైనా విద్యుదాఘాతం తగిలితే రక్షించాలనే ఆతృతతో ముట్టుకోవద్దు. విద్యుత్తు సరఫరాను నిలిపివేయాలి.

పంట పొలాల రక్షణ కంచెలకు విద్యుత్తు కనెక్షను ఇవ్వవద్దు. సోలార్ ఫెన్సింగ్ ఉపయోగించుకోవచ్చు.

ఏడాది కాలంలో జరిగిన ప్రమాదాలు

ఖమ్మంలో.... 30 మంది వ్యక్తులు, 153 పశువులు

భద్రాద్రి కొత్తగూడెంలో...32 మంది వ్యక్తులు, 102 పశువులు మృత్యువాత పడ్డాయి. మరెందరో గాయాలపాలయ్యారు.

మధిరలో వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో కొణతం రామచంద్రరావు(59), కంభం అనిల్(21) మృతి చెందారు.

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల నివారణ

నిర్లక్ష్యం, అవగాహన లేమితోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రజలను, రైతులను చైతన్య పరిచేందుకు ఏటా మే మొదటి వారంలో భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే అనేక ప్రమాదాలను నివారించి, ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఏదైనా ఘటనను గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలి.

ఎ.సురేందర్, ఎస్ఈ, ఖమ్మం

సమాచారం ఇద్దాం... తెగిన, వేలాడే విద్యుత్తు తీగలు, ప్రమాదాలు గుర్తించిన వెంటనే టోల్ ఫ్రీ నెంబరు: 1800 425 0028, హెల్ప్‌లైన్ 1912కు సమాచారం అందించాలి.

# ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి

ఖమ్మం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో దశాబ్దాల నుంచి పనిచేస్తున్న ఉద్యోగుల క్రమబద్ధీకరణ, హెచ్‌ఆర్ పాలసీ అమలు ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. ఈ మేరకు ఖమ్మం డీసీసీబీలో నిర్వహించిన డీఎల్‌ఈసీ(డిస్ట్రిక్ట్ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ)లో ఆమోదముద్ర పడింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తీర్మానించారు. ఈడీసీసీబీ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని 100 పీఏసీఎస్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీవో-44 ప్రకారం అర్హత ఉన్న వారిని గుర్తించి ఉత్తర్వులు వెలువరించారు.

ఏప్రిల్ నెల నుంచే కొత్త వేతనాలురెగ్యులర్ అయిన వారికి వేతనాలను సవరించారు. ప్రతి ఉద్యోగికి నిర్దేశించిన ప్రకారం పే స్కేల్ వర్తింపజేశారు. ఏప్రిల్ 1 నుంచే కొత్త వేతనాలు చెల్లిస్తారు. ఇందుకోసం ప్రతి సహకార సంఘంలో 'మార్జిన్ మనీ' ఖాతాలు తెరవనున్నారు. ఇక నుంచి ఈ ఖాతాల్లో జమచేసిన నిధుల ద్వారానే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తారు. గతంలో ప్రతి బ్రాంచి మేనేజర్ మూడు నెలలకోసారి సంఘాలను తనిఖీ చేసేవారు. ఇక నుంచి ప్రతి నెలా పరిశీలించాల్సి ఉంటుంది. గతంలో సహకార సంఘాల్లో పనిచేసి సస్పెన్షన్‌కు గురైనవారు, దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినవారు, మధ్యలో ఉద్యోగాలు మానేసి తిరిగొచ్చి చేరిన వారి గురించి డీఎల్‌ఈసీ సమావేశంలో చర్చించారు. ఖమ్మం జిల్లాలో 20 మంది, భద్రాద్రి జిల్లాలో ఇద్దరు ఉన్నారు. వీరికి సంబంధించి 'స్టేటస్‌కో' అమలుచేయాలని నిర్ణయించారు.

కారుణ్య నియామకాలకు పచ్చజెండా..

కారుణ్య నియామకాలకు సంబంధించిన వారు ఖమ్మం జిల్లాలో ఐదుగురు, భద్రాద్రి జిల్లాలో ముగ్గురు ఉన్నారు. నిబంధనల ప్రకారం



వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరించే విషయమై సమావేశంతో సానుకూలంగా తీర్మానించారు. రికవరీ ఉన్న వారి జాబితాను పెండింగులో ఉంచారు. గతంలో క్రమశిక్షణ చర్యలకు గురై రివర్షన్ అయిన ఉద్యోగులకు.. ప్రస్తుతం వారు పనిచేస్తున్న క్యాడర్‌లోనే పే ఫిక్సేషన్ చేశారు.

డీఎల్‌ఈసీ, డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఖమ్మం డీసీవో ఎ.విజయకుమారి, డీసీసీబీ సీఈవో, డీఎల్‌ఈసీ సభ్యుడు అట్లూరి వీరబాబు, నాబార్డు డీడీఎం సుజిత్‌కుమార్, ప్యాక్స్ హెచ్‌ఆర్‌డీ సలహాదారు నర్సింహారెడ్డి, టెస్కాబ్ ఏజీఎం వివేక్, డీఎల్‌ఈసీ విభాగం ఇన్‌ఛార్జి, డీసీసీబీ జీఎం పద్మావతి, భద్రాద్రి కొత్తగూడెం డీసీవో వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

# తడిసిన ధాన్యం.. ఉప్పుతో ఉపకారం!

ములుగు : ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ముమ్మరమై.. కొనుగోలు కేంద్రాలు ధాన్యంతో పోటెత్తుతున్న సమయంలోనే అకాల వర్షాలు అడ్డుపడ్డాయి. కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దవ్వడం.. పొల్లాలోని వరి నేలవాలడంతో కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ధాన్యం మొలకెత్తకుండా పలు విధాలా ప్రయత్నిస్తున్నారు. తడిసిన వడ్లు రంగు మారకుండా, మొలకలు రాకుండా 'ఉప్పు' ఉపకారిగా పనిచేస్తుందని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వారి సూచనలను పాటిస్తూ.. ధైర్యంగా ఉందాం..ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా యాసంగిలో సాగైన వరి: 6,48,090 ఎకరాలు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 70 శాతం, మహబూబా బాద్ 45, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో 50 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. జనగామ జిల్లాలో వడగళ్లతో చాలా చోట్ల పంట చేతికిరాకుండా నేలరాలింది. ఇక్కడ 30 శాతం కోతలే పూర్తయ్యాయి.

ఊహించని నష్టం...వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మార్చి నుంచి ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో 1.20 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కురిసిన వాన వల్ల 15 లక్షల క్వింటాళ్ల ధాన్యం కల్లాల్లో తడిసి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. నీళ్లలో కొట్టుకుపోయింది ఎక్కువగానే ఉంది. వాటికి లెక్కలు లేవు. ఆరు జిల్లాల్లో లక్ష ఎకరాలకు పైగా పొలాల్లో ధాన్యం నేలరాలింది.

ఈ జాగ్రత్తలు తీసుకుందాం.. కుప్పలుగా పోసిన ధాన్యాన్ని పలుచగా నేలపై చల్లినట్లు ఆరబోయాలి. ఎప్పటికప్పుడు కలియదిప్పడంతో పాటు గాలి అందేలా చూడాలి. తడిసినవి, రంగుమారిన గింజలను మంచి ధాన్యంతో కలపకూడదు. వేర్వేరుగా ఉంచితే ఎక్కువ నష్టం జరగదు. తడవకుండా ఉండేందుకు కుప్పను ప్రత్యేకమైన పద్ధతిలో కాపాడేలా టార్పాలిన్లు కప్పాలి. వరద పక్కనుంచి వెళ్లేలా పాదులు తీయాలి.

మార్చిలో కోతకు వచ్చేలా..యాసంగి వరి సాగు చేసేవారు మార్చిలో కోతకు వచ్చేలా నాట్లు వేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జనవరి 26 వరకు నాట్లు వేస్తే సరిపోతుంది. చాలా మంది ఫిబ్రవరి మొదటి వారంలో నాట్లు వేయడం వల్ల కోతలు అనుకున్న సమయానికి రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అకాల వర్షాలు తోడుకావడంతో అన్నదాతలు నష్టపోయారు.వర్షపాతం ఇలా.... గతేడాది (2022) జూన్ 1 నుంచి ఈ ఏడాది మే 2వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,002.5 మి.మీల సగటు వర్షపాతం నమోదు కావాలి. 1,585.83 మిల్లీమీటర్లు కురిసింది.

# మావోయిస్టుల కదలికలపై నిఘా

ములుగు : మావోయిస్టు కదలికలపై డేగకన్ను వేయాలని రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఐజీ ప్రభాకర్‌రావు ఆదేశించినట్లు తెలిసింది. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన వెంకటాపురం పోలీస్ సర్కిల్ కేంద్రంలో ఆయన రహస్యంగా పర్యటించారు. ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నక్సల్స్ కదలికలపై ఆరా తీసినట్లు సమాచారం. ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం అనంతరం ఇక్కడ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కీలకమైన ఈ ప్రాంతంలో పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

రెండు జిల్లాల అధికారులతో సమీక్ష

భౌగోళికంగా మావోయిస్టుల కదలికలు, రాకపోకలకు అనుకూలంగా ఉన్న ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ సర్కిల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీస్ సర్కిల్ పరిధిలోని దండకారణ్యంపై నిశిత శోధన చేపట్టాలని ఉన్నత స్థాయి అధికారులు సూచించినట్లు తెలిసింది. ములుగు ఎస్పీ గాష్ ఆలం, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ వినీత్, భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్‌లతో పాటు సీఆర్పీఎఫ్, ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో ఇక్కడ రహస్య సమావేశం అయ్యారు. తనిఖీలు నిర్వహించి తిరుగుముఖం పట్టిన జవాన్లను మావోయిస్టులు మట్టుబెట్టిన



తీరు, దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత క్రమంలో తీసుకోవాల్సిన రక్షణ, భద్రత చర్యలపై కీలకాంశాలను చర్చించినట్లు తెలుస్తోంది. కట్టుదిట్టమైన భద్రతతో శత్రువును తుదముట్టించేందుకు ప్రణాళికలు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

దండకారణ్యంలోకి అడుగు పెట్టకుండా..

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా, దంతెవాడ, బీజాపూర్ జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతాన్ని అక్కడి సీఆర్పీఎఫ్, డీఆర్జీ, ఏఎస్టీఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్ బృందాలు జల్లెడ పడుతున్న క్రమంలో మావోయిస్టులు తెలంగాణ అరణ్యంలోకి ప్రవేశించే అవకాశాలు ఉన్నట్లు ఉన్నత స్థాయి సమీక్షలో పోలీసు అధికారులు ఓ నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అక్కడ కూంబింగ్ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో దండకారణ్యంలోకి మావోయిస్టులు అడుగులు పెట్టకుండా కట్టుదిట్టమైన నిఘాను పెంచాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మావోయిస్టులు ఏ ప్రాంతానికి వచ్చినా ఎదుర్కొనేలా సంసిద్ధం కావాలని సూచించినట్లు తెలిసింది.

అంతా గోప్యంగానే..

శాంతిభద్రతల పరిరక్షణకు గాను చేపట్టిన ఉన్నత స్థాయి సమీక్షను పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచారు. ఎవరు పర్యటించారు? సమీక్షకు సంబంధించిన విషయాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. డ్రోన్ ఆపరేషన్ ప్రాంతానికి వెళ్లేందుకు మీడియా ప్రయత్నించినా పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం, పర్యటనకు సంబంధించి కనీస ప్రకటన సైతం జారీ చేయకపోవడం గమనార్హం. డ్రోన్‌తో అన్వేషణఉన్నతస్థాయి సమీక్ష నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా నిఘా పెంచారు. వెంకటాపురం-వాజేడు మార్గంలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. సీఆర్పీఎఫ్, ప్రత్యేక పోలీసు బలగాలతో గస్తీ తిరిగారు. పట్టణ శివారులోని ఓ మైదాన ప్రాంతంలో డ్రోన్ ఆపరేషన్ చేపట్టారు. సాంకేతికత సాయంతో సరిహద్దు దండకారణ్యంలో సర్వే చేశారు. మావోయిస్టుల కదలికలు ఉండే గుట్టల ప్రాంతాన్ని డ్రోన్ ద్వారా పరిశీలించారు. ఆయా చిత్రాలను సైతం సమీక్ష సమావేశంలో ప్రదర్శించి చర్చించినట్లు తెలుస్తోంది.




అమరావతి: సొంత వైఫల్యాలతో ప్రజల్లో సీఎం జగన్ వ్యతిరేకత మూటగట్టుకున్నారని తెలుగుదేశం అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. ప్రజల్లో వ్యతిరేకత పెరగడంతో జగన్‌లో ఫ్రస్టేషన్ పెరిగిందన్నారు. ఆ మానసిక ఆందోళనతో 60 ఏళ్లుగా తెలుగు ప్రజలకు సేవ చేస్తున్న మార్గదర్శిని వేధించేందుకు లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు. పలు సంస్థలను నిర్వీర్యం చేసే సైకో చర్యలకు పాల్పడిన జగన్ రెడ్డి.. ఇప్పుడు ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాను కూల్చాలని కుట్ర పన్నుతున్నారంటూ మండిపడ్డారు. ఈ మేరకు చంద్రబాబు ట్వీట్ చేశారు. వైకాపా మోసాలు, నీచాలు ఎండగడుతున్న 'ఈనాడు'ని ఓ నియంతలా జగన్ వేధించి భయపెట్టాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. తనకు భజన చేసే మీడియాకు మాత్రం అమిత ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. జర్నలిజం, సాహిత్యం, విద్యలో రామోజీరావు చేసిన సేవలకు భారతదేశ రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ లభించిందని గుర్తుచేశారు.

అంతటి మహావ్యక్తి లక్ష్యంగా వైకాపా కుట్రపూరిత చేస్తున్న దాడుల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. జగన్ చేసిన దుష్ట ప్రయత్నాలన్నీ విఫలం కావడంతో ఇక ముఖం చాటేశారని ఎద్దేవా చేశారు. చెడు ఎప్పుడూ ఓడిపోతుందని, మంచిదే అంతిమ విజయమన్నారు. తెలుగు ప్రజలంతా రామోజీరావుతోనే ఉన్నారని గుర్తుంచుకోవాలని చంద్రబాబు స్పష్టంచేశారు.

# జగన్ శాడిజాన్ని ప్రజలంతా చూస్తున్నారు: లోకేశ



అమరావతి: పాలకుల అవినీతిని, అసమర్ధతను ప్రజల దృష్టికి తెచ్చే మీడియా సంస్థల మీద పగబట్టడం ప్రజాస్వామ్యానికే ముప్పని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ఈనాడు మీద పగబట్టి, ఆ పగను మార్గదర్శి సంస్థలపై తీర్చుకుంటున్న జగన్ రెడ్డి శాడిజాన్ని ప్రజలంతా చూస్తున్నారని హెచ్చరించారు. ఈ మేరకు మీడియా సంస్థలపై జగన్ కక్ష సాధింపును ఖండిస్తూ లోకేశ్ ట్వీట్ చేశారు. "తన పగను తీర్చుకోవడానికి జగన్ ప్రభుత్వ సంస్థలను వాడుతున్నారు. ఆ సైకో చేష్టల పట్ల ప్రజలకు జుగుప్స కలుగుతోంది. ప్రజల శ్రేయస్సు కోసమైతే పోలవరం కట్టండి.. అమరావతిని నిర్మించండి. ఎస్సీలను చంపి డోర్ డెలివరీ చేసిన వైకాపా నేతలపై చర్యలు తీసుకోండి. ప్రజలను చైతన్యం చేస్తున్న మీడియా అధిపతులను వేధించకండి" అని లోకేశ్ సూచించారు.

**మీడియా అధిపతులను వేధించకండి.. వారిపై పగ ప్రజాస్వామ్యానికే ముప్పు :** పాలకుల అవినీతిని, అసమర్ధతను ప్రజల దృష్టికి తెచ్చే మీడియా సంస్థల మీద పగబట్టడం ప్రజాస్వామ్యానికే ముప్పు అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు.

సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈనాడు మీద పగబట్టి, ఆ పగను మార్గదర్శి సంస్థలపై తీర్చుకుంటున్న జగన్ రెడ్డి శాడిజాన్ని ప్రజలంతా చూస్తున్నారన్నారు. తన చేతిలో ఉన్న ప్రభుత్వ సంస్థలన్నింటినీ పగ తీర్చుకోవడం కోసం జగన్ వాడుకోవడం చూస్తే... ఆ సైకో చేష్టల పట్ల ప్రజలకు జుగుప్స కలుగుతోందని వ్యాఖ్యలు చేశారు9. ఇదంతా చేస్తున్నది ప్రజల శ్రేయస్సు కోసమే అనుకుంటే పోలవరం కట్టాలని... రాజధాని అమరావతిని నిర్మించాలని డిమాండ్ చేశారు. దళితులను చంపి డోర్ డెలివరీ చేసిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకానీ ప్రజలను చైతన్యవంతం చేస్తున్న మీడియా అధిపతులను వేధించకండి అంటూ లోకేశ్ పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితాలో భారీగా అవకతవకలు



విజయవాడ: ఓటర్ల జాబితా విషయమై ఏపీలో అవకతవకలు జరుగుతున్నాయని రాష్ట్ర బీజేపీ చీఫ్ పురందేశ్వరి ఆరోపించారు. సోమవారం ఓటరు అవగాహనపై బీజేపీ రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమంలో పురందేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ బీజేపీ చీఫ్ మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో సామాన్యుల చేతిలో ఉన్న గొప్ప ఆయుధం ఓటు అని చెప్పుకొచ్చారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు గతంలోనూ ఇప్పుడూ జరుగుతున్నాయన్నారు. తమకు వ్యతిరేకంగా ఉన్న వారి ఓట్లను తొలగించడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వేల సంఖ్యలో ఓట్ల విషయంలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఉరవకొండలో ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడిన ఇద్దరు ఉన్నతాధికారులు సస్పెండ్ అయ్యారన్నారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల ఇచ్చిన ఫిర్యాదుతో సస్పెన్షన్ చేశారని తెలిపారు. ఓటర్ల జాబితా పర్యవేక్షణ కోసం స్థానికంగా కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్ల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ల జాబితాలో చేరికలు.. తీసివేతలు జరుగుతున్నాయన్నారు. వలంటీర్లు పంపిన సమాచారాన్ని క్రోడీకరించి అవకతవకలకు పాల్పడేందుకు హైదరాబాదులో ఓ వ్యవస్థనే ఏర్పాటు చేశారని తెలిపారు. ఇలాంటి వాటి విషయంలో బీజేపీ సీరియస్‌గా వ్యవహరిస్తుందని పురందేశ్వరి పేర్కొన్నారు.




# 27 వారాల గర్భవిచ్ఛిత్తికి సుప్రీం అనుమతి

ఢిల్లీ: వైవాహిక బంధానికి వెలుపల తన సమ్మతి లేకుండా బలవంతంగా గర్భం దాల్చాల్సి రావడం కోలుకోలేని గాయం లాంటిదేనని, ఆ పరిస్థితి తీవ్ర మనోవేదనకు గురిచేస్తుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సామూహిక అత్యాచారానికి గురై, గర్భం దాల్చిన మహిళ తన 27వారాల గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకునేందుకు కోర్టు అనుమతించింది. ఈ సందర్భంగా బాధిత మహిళ కేసులో గుజరాత్ హైకోర్టు వ్యవహరించిన తీరును సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. "మన వివాహ వ్యవస్థలో ఓ మహిళ తల్లవడం అనేది ఆ దంపతులకే కాదు.. వారి కుటుంబసభ్యులకూ అత్యంత సంతోషకరమైన విషయం. కానీ, వివాహ బంధానికి వెలుపల తన సమ్మతి లేకుండా గర్భం దాల్చడం అనేది ఆ మహిళ జీవితానికి హానికరం. ముఖ్యంగా అత్యాచారం కారణంగా గర్భం రావడం బాధిత మహిళను తీవ్ర వేదనకు గురిచేస్తుంది. ఇది ఆమె శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఓ మహిళ లైంగిక దాడిని ఎదుర్కోవడమే అత్యంత బాధాకరమంటే.. దాని ఫలితంగా ఆమె గర్భం దాల్చడం కోలుకోలేని గాయమే అవుతుంది" అని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో బాధిత మహిళ గర్భ విచ్ఛిత్తికి గుజరాత్ హైకోర్టు అనుమతించకపోవడం సరికాదని సుప్రీంకోర్టు ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. బాధిత మహిళ వ్యథ, వైద్య రిపోర్టులను పరిగణనలోకి తీసుకుని ఆమె తన 27 వారాల గర్భాన్ని తొలగించుకునేందుకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. రేపే ఆమె ఆసుపత్రిలో చేరాలని ఆదేశించింది. ఒకవేళ, విచ్ఛిత్తి ప్రక్రియ సమయంలో పిండం సజీవంగా ఉంటే.. ఇంక్యుబేషన్‌లో పెట్టి సంరక్షించాలని సూచించింది. ఆ తర్వాత చట్టప్రకారం ఆ చిన్నారి సంరక్షణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకోవాలని వెల్లడించింది.

**మా ఉత్తర్వులకు వ్యతిరేకంగా ఎలా తీర్పిస్తారు..?** బాధిత మహిళ తొలుత తన గర్భాన్ని విచ్ఛిత్తి చేసుకునేందుకు అనుమతినివ్వాలని కోరుతూ ఈ నెల 7న గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. 8న కోర్టు విచారణకు స్వీకరించి.. వైద్య నివేదికకు ఆదేశించింది. 10న నివేదిక వచ్చింది. 11న నివేదిక అందినట్లు ధ్రువీకరించి కేసును 12 రోజులకు అంటే 23కు హైకోర్టు వాయిదా వేసింది. దీంతో బాధితురాలు సుప్రీంకోర్టుకు వెళ్లగా.. గుజరాత్ హైకోర్టు తీరుపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌ను పెండింగ్‌లో పెట్టడం ద్వారా విలువైన సమయం వృథా అయిందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. అనంతరం దీనిపై సోమవారం విచారణ చేపడుతామని తెలిపింది. అయితే ఈ లోగానే, గత శనివారం గుజరాత్ హైకోర్టు విచారణ జరిపి మహిళ పిటిషన్‌ను కొట్టేసింది. దీనిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. "గుజరాత్ హైకోర్టులో ఏం జరుగుతోంది..? అత్యున్నత న్యాయస్థానం ఉత్తర్వులకు వ్యతిరేకంగా దేశంలో ఏ కోర్టూ తీర్పులు ఇవ్వకూడదు. ఇది రాజ్యాంగ ఫిలాసఫీకి విరుద్ధం" అని సుప్రీంకోర్టు ధర్మాసనం ఘాటుగా స్పందించింది.




ఢిల్లీ: మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ రాజకీయ జీవితం అత్యంత దారుణ రీతిలో ముగిసిందని ఆయన సతీమణి, కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ అన్నారు. కానీ ఆయన పాలించిన కొద్దికాలంలోనే ఎన్నో కీలక విజయాలను సాధించారని తెలిపారు. 25వ రాజీవ్ గాంధీ నేషనల్ సద్భావన అవార్డు కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. 'రాజీవ్ గాంధీ రాజకీయ జీవితం దారుణమైన రీతిలో ముగిసింది. కానీ.. ఆయన పాలించిన కొద్దిసమయంలోనే లెక్కలేని విజయాలు సాధించారు.

ఆయన మహిళా సాధికారతకు కృషి చేశారు. పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు పోరాటం చేశారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం భారీ స్థాయిలో ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధులు ఉన్నారంటే.. అందుకు రాజీవ్ కఠోర శ్రమ, దూరదృష్టే కారణం. అలాగే ఓటు వేసే వయసును 21 నుంచి 18కి తగ్గించారు' అంటూ ఆయన హయాంలో తీసుకున్న నిర్ణయాలను సోనియా కొనియాడారు. అలాగే విద్వేషం, సమాజంలో విభజన, పక్షపాత రాజకీయాలు చురుగ్గా మారుతున్నాయని, వాటికి అధికార పక్షం నుంచి మద్దతు లభిస్తోందని విమర్శించారు. ఈ తరుణంలో మత సామరస్యం, శాంతి, దేశ ఐక్యత వంటి సిద్ధాంతాలు ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయని ఆమె అన్నారు. అన్ని మతాలు, సంస్కృతులు, భాషలు, జాతుల సమాహారం వల్లే ఈ దేశ ఐక్యత బలోపేతం అవుతుందని రాజీవ్ భావించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజస్థాన్‌లోని బనస్థలి విద్యాపీఠ్‌కు 2020-21వ సంవత్సరానికి 25వ రాజీవ్ సద్భావన అవార్డును ఆదివారం మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ బహూకరించారు. ఈ అవార్డు కింద రూ.10 లక్షల నగదు, ప్రశంసా పత్రం.. ఆ సంస్థకు చెందిన సిద్ధార్థ్ శాస్త్రికి అందజేశారు.




బెంగళూరు: చందమామపై కాలుపెట్టే చారిత్రక ఘట్టం కోసం చంద్రయాన్-3 శరవేగంగా అడుగులు వేస్తోంది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్‌కు అనువైన ప్రదేశం కోసం విక్రమ్ ల్యాండర్ అన్వేషణ సాగిస్తోంది. ఈ క్రమంలోనే భూమికి ఎప్పుడూ కన్పించని జాబిల్లి అవతలివైపు (దక్షిణ ధ్రువం ఉండే ప్రాంతం) చిత్రాలను ల్యాండర్ తన కెమెరాలో బంధించింది.

ఈ ఫొటోలను భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం తన ఎక్స్ (ట్విటర్) ఖాతాలో పంచుకుంది. "విక్రమ్ ల్యాండర్‌కు అమర్చిన ల్యాండర్ హజార్డ్ డిటెక్షన్ అండ్ అవైడెన్స్ కెమెరా .. భూమికి కన్పించని జాబిల్లి అవతలివైపు ఫొటోలను తీసింది. చంద్రుడి ఉపరితలంపై విక్రమ్ సురక్షితంగా ల్యాండ్ అయ్యే ప్రాంతాన్ని గుర్తించేందుకు ఈ కెమెరా సాయపడుతుంది. బండరాళ్లు, లోతైన కందకాలు లేని ప్రదేశం కోసం ల్యాండర్ అన్వేషిస్తోంది" అని ఇస్రో రాసుకొచ్చింది. ఆగస్టు 19న ల్యాండర్ ఈ ఫొటోలు తీసినట్లు ఇస్రో వెల్లడించింది. తాజా ఫొటోల్లోనూ జాబిల్లి ఉపరితలంపై అనేక బిలాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. వాటి పేర్లను ఇస్రో తాము విడుదల చేసిన ఫొటోల్లో పేర్కొంది. సాధారణంగా మనకు ఎప్పుడూ చంద్రుడి ఒకవైపే కన్పిస్తుంది. అవతలి వైపు కనిపించదు. చంద్రుడు తన కక్ష్య మీద ఒకసారి పూర్తిగా భ్రమించటానికి పట్టే సమయం, భూమి చుట్టూ తిరిగి రావటానికి పట్టే సమయం సమానంగా ఉంటుంది. దీన్ని టైడల్ లాకింగ్ అంటారు. దీని మూలంగానే చంద్రుడి ఒక వైపే మనకు కనిపిస్తుంది. ఇప్పుడు ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్-3.. జాబిల్లి పైకి ఎవరూ వెళ్లని మార్గంలో దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఆ ధ్రువం దిశగా పయనిస్తోన్న ల్యాండర్ విక్రమ్.. జాబిల్లి అవతలివైపు దృశ్యాలను తీసింది. ప్రస్తుతం ల్యాండర్ జాబిల్లి చుట్టూ ఉన్న 25ఐ134 కి.మీల కక్ష్యలో పరిభ్రమిస్తోంది.

ఈ నెల 23న సాయంత్రం 6.04 గంటలకు విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై కాలుమోపనున్నట్లు ఇస్రో ప్రకటించింది. ఇది విజయవంతమైతే.. జాబిల్లిపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన సోవియట్ యూనియన్, అమెరికా, చైనా జాబితాలో భారత్ కూడా చేరనుంది.

# లోకేశ్ సమక్షంలో టీడీపీలో యార్లగడ్డ

అమరావతి: వైసీపీకి గుడ్‌బై చెప్పిన యారగడ్డ వెంకట్రావ్ టీడీపీలో చేరారు. సోమవారం టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో యార్లగడ్డ తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. పసుపు కండువా కప్పి యార్లగడ్డను లోకేశ్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం లోకేశ్‌తో యార్లగడ్డ వెంకట్రావు విడిగా సమావేశం అయ్యారు. యార్లగడ్డ టీడీపీలో చేరిన సందర్భంగా వంశీ పోవాలి యార్లగడ్డ గెలవాలి అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. మరోవైపు రేపు (మంగళవారం) గన్నవరంలో యువగళం భారీ బహిరంగ సభ జరుగనుంది. దాదాపు 2 లక్షల మంది బహిరంగ సభకు హాజరయ్యేలా తెలుగుదేశం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ సమయంలో యార్లగడ్డ చేరిక పార్టీకి అదనపు బలం చేకూర్చిందని తెలుగుదేశం శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# చదువు ర్యాంకుల కోసం కాదు.. ఇష్టపడి, కష్టపడి చదవండి



గుంటూరు: చదువు ర్యాంకులు కోసం కాదని... విజ్ఞానం, వివేకం పెంచుకోవడానికి అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. సోమవారం గుంటూరులో భాష్యం విద్యాసంస్థల విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో వెంకయ్య పాల్గొన్నారు. భాష్యంలో చదవి జేఈఈ అడ్వాన్సుడ్ ఫలితాల్లో అఖిలభారత స్థాయి ఓపెన్ కేటగిరీ 5, 10వ ర్యాంకు సాధించిన విద్యార్థులను మాజీ ఉపరాష్ట్రపతి సన్మానించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ... ఇష్టపడి, కష్టపడి చదవాలన్నారు. కులాల కుమ్ములాటలో యువకులు దూరవద్దని సూచించారు. ప్రాథమిక విద్య మాతృభాషలో జరగాలని.. కొత్త విద్యా విధానంలో ఈ అంశానికి ప్రాధాన్యత ఇచ్చారని వెంకయ్య తెలిపారు. మన దేశం ఇప్పుడు అంతరిక్ష పరిశోధనలో దూసుకెళ్తోందని అన్నారు. చంద్రయాన్ 3 ద్వారా ఇస్రో సత్తా ప్రపంచానికి తెలిసిందన్నారు. తెలుగువారు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. సత్య నాదెళ్ల, సుందర్ పిచాయ్, రుషి షునాక్ వంటి వారు భారతదేశ ప్రతిష్టను పెంచారని చెప్పుకొచ్చారు. సేవ చేయడం కోసం రాజకీయాలు కీలకమన్నారు. విద్య అందించడం కూడా సేవలో భాగమే అని తెలిపారు. దేశాన్ని ఆర్థిక శక్తిగా తయారు చేయాలన్నారు. సెల్ ఫోన్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు బానిసలు కావద్దని సూచించారు. సాంకేతికత అవసరమే కానీ పూర్తిగా దానిమీదే ఆధార పడవద్దన్నారు. చిన్న చిన్న సమాచారం కోసం కూడా ఇంటర్నెట్‌పై ఆదారపడుతున్నారని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# దొంగ ఓట్లతో గెలవాలని వైసీపీ చూస్తోంది




విజయవాడ: తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో మెంబర్ బోండా ఉమమహేశ్వరరావు, వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దొంగ ఓట్లతో ఎన్నికల్లో గెలవాలని వైసీపీ ప్రయత్నిస్తోందని, ఏపీలో పెద్దఎత్తున టీడీపీ ఓట్లు తొలగించటానికి చూస్తోందన్నారు. టీడీపీ అనుకూల, సానుభూతి పరుల ఓట్లను తొలగించటానికి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద టీమ్ పనిచేస్తుందని ఆరోపించారు. టీడీపీ ఓట్లు తొలగించటానికి అధికారులను ఇష్టమొచ్చినట్లు వాడుకుంటున్నారని బోండా ఉమ విమర్శించారు. వైసీపీ చెప్పినట్లు చేసి అనంతపురం జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి సస్పెండ్ అయ్యారని, పాత జెడ్పీ సీఈవో శోభస్వరూపా కూడా సస్పెండ్ అయ్యారని బోండా ఉమ అన్నారు. త్వరలో వారిని అరెస్టు చేస్తారన్నారు. వైసీపీ మాటలు విని తప్పుడు విధానాలతో ఓట్లు తొలగించే ఏ అధికారికైనా ఇదే పరిస్థితి వస్తుందన్నారు. టీడీపీ ఓట్ల వెరిఫికేషన్‌పై మానిటరింగ్ టీమ్ పెట్టామని, ఎక్కడైనా ఎవ్వరైనా తప్పు చేస్తే తెలిసిపోతుందన్నారు. ఏపీలో ఓటరు లిస్టు అక్రమాలపై త్వరలో ఢిల్లీలో ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను చంద్రబాబు కలుస్తారని బోండా ఉమ స్పష్టం చేశారు.

# టాప్ లెస్ డ్రెస్ లో థైస్ ఎక్స్ ఫోజ్ చేసి కన్నుల విందు

నాని హీరోగా నటించిన ఆహా కళ్యాణం సినిమా తో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ వాణి కపూర్. తెలుగు లో ఈ అమ్మడు చేసింది ఒకే ఒక్క సినిమా అయినా కూడా అప్పటి నుండి ఇప్పటి వరకు అమ్మడు సోషల్ మీడియాలో ఫొటోలు షేర్ చేసినా.. వీడియోలు షేర్ చేసినా కూడా వైరల్ అవుతూనే ఉంటుంది. తాజాగా మరోసారి నాని హీరోయిన్ వాణి కపూర్ హాట్ ఫొటో షూట్ షేర్ చేసిన అభిమానులతో పాటు అందరిని కూడా షాక్ అయ్యేలా చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా సంవత్సరాలు అయింది. ఈ మధ్య కాస్త బిజీగా సినిమాలు చేస్తోంది. ఆకట్టుకునే రూపం ఈ



అమ్మడి సొంతం.. అంతే కాకుండా ఫిజిక్ విషయంలో ఈ అమ్మడి తర్వాతే మరెవరైనా అన్నట్లుగా ఉంటుంది. యాక్షన్ సన్నివేశాలకు మోస్ట్ వాంటెడ్ అన్నట్లుగా ఉంటూ.. రొమాంటిక్ సన్నివేశాల్లో ఎలా నటించినా కూడా ఆహా అనిపించే విధంగా ఉండే వాణి కపూర్ ఈ ఫొటోలు చాలా మంది గుండెలకు గుచ్చుకుంటున్నాయి అంటూ కామెంట్స్ వస్తున్నాయి. టాప్ లెస్ సింగిల్ పీస్ డ్రెస్ లో ఈ అమ్మడు థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ చేసిన ఫొటో షూట్ కు సాధారణంగానే అంతా కూడా ఫిదా అవ్వాల్సిందే. అలాంటిది వాణి కపూర్ వంటి అందాల ముద్దుగుమ్మ షేర్ చేస్తే ఇంకా ఏమైనా ఉందా అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

## నాభి అందం.. నడుము సొగసు.. కళ్లు తిప్పుకోనివ్వవు!

బెంగాలీ బ్యూటీ శ్రద్ధా దాస్ టాలీవుడ్ లో అడుగుపెట్టి దశాబ్దం పైగానే అవుతోంది. ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా పోటీబరిలో ఒక నటిగా ఇంత లాంగ్ జర్నీ సాగించడం అంటే అంత సులువేమీ కాదు. స్టార్ హీరోయిన్ కాలేకపోయినా తనకంటూ కొన్ని అవకాశాలను సృష్టించుకుని కెరీర్ బండిని లాగిస్తున్న ఈ బ్యూటీపై కొన్ని విమర్శలున్నాయి. అందివచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని.. స్క్రిప్ట్ ఎంపికలు సరిగా లేవని కెరీర్ ఆరంభం విమర్శించారు. కానీ శ్రద్ధా తన జర్నీని ఎప్పటికప్పుడు పట్టాలు తప్పకుండా జాగ్రత్త పడుతూ ముందుకు సాగిన తీరు ప్రశంసించదగినదే. ఇటీవలి కాలంలో సోషల్ మీడియా ట్రెండ్ ని శ్రద్ధా తెలివిగా ఎన్ క్యాష్ చేసుకుంటోంది. నిరంతరం వేడెక్కించే



ఫోటోషూట్లను షేర్ చేస్తూ అభిమానులను పెంచుకుంటోంది. ఇతర భామలతో పోలిస్తే శ్రద్ధా టూమచ్ గా చెలరేగుతోందనే చెప్పాలి. సంథింగ్ హాట్ గా అందాలను ఆరబోసే ఫోటోలను శ్రద్ధా షేర్ చేస్తోంది. ఇప్పటికే ఇన్ స్టా వేదికగా ఇబ్బడిముబ్బడిగా ఈ భామ ఫోటోషూట్లు వేడెక్కిస్తూనే ఉన్నాయి. తాజాగా నాభి అందం.. నడుము సొగసును ఆవిష్కరిస్తూ వైట్ అండ్ వైట్ శారీలో శ్రద్ధా కిల్లర్ లుక్ తో కట్టి పడేసిన ఫోటో వైరల్ గా మారింది. అలా శ్రద్ధగా పవిట కొంగును జారవిడిచి .. కుచ్చిళ్లను నాభి కిందుగా దోపిన వైనం గంగ వెర్రులెత్తిస్తోందంటూ అభిమానుల్లో గుసగుస మొదలైంది. శ్రద్ధాదాస్ చిత్రం పారిజాత పర్వం పోస్టర్ ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. కుర్చీకి కట్టేసి బంధిఖానా అయిన ముసుగు అమ్మాయి పోస్టర్ ట్రెండింగ్ అయింది. సంతోష్ కంభంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫీమేల్-సెంట్రిక్ కామిక్ థ్రిల్లర్ అని .. తాను ఆసక్తికర పాత్రలో కనిపిస్తానని.. 3డిలోను విడుదలవుతుందని కూడా శ్రద్ధా చెప్పింది. టైటిల్ లోనే ఒక రహస్యం ఉంది. సినిమా కూడా ప్రత్యేకమైనది. ఇది చాలా సర్ప్రైజ్ లతో కూడిన వినోదభరితమైన డ్రామా. నా పాత్ర విభిన్న షేడ్స్ తో చాలా వినోదాత్మకంగా ఉంటుంది. గ్రిప్పింగ్ స్క్రిప్ట్ నా క్యారెక్టర్ డిజైన్ నన్ను ఉత్తేజపరిచాయి అని శ్రద్ధా చెప్పింది. ఈ సినిమా కథాంశం ఆసక్తికరం. గతం వర్తమానం లో పాత్రల ప్రవేశం ఆకట్టుకుంటుంది. స్క్రిప్ట్ విన్నప్పుడు నేను చివరివరకూ నవ్వుతూనే ఉన్నానని శ్రద్ధా తెలిపింది. ఆసక్తికరంగా చాలా కాలం తర్వాత శ్రద్ధా ఈ చిత్రంలో ఒక పాటను పాడింది.




# యువరాణి రూపానికి మతి భ్రమించాలంతే!





NTR 30 చిత్రంతో టాలీవుడ్ లో అడుగు పెడుతోంది కపూర్ కాంపౌండ్ యువరాణి జాన్వీ. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలి రాకతో తెలుగు లోగిళ్లు పునీతం కాబోతున్నాయంటూ అభిమానులు ఎంతో ఎగ్జయిట్ అవుతున్నారు. సోషల్ మీడియాల్లో జాన్వీకి వెల్ కం చెబుతూ తారక్ ఫ్యాన్స్ లవ్ హార్ట్ ఈమోజీలను షేర్ చేస్తున్నారు. ఆరంగేట్రమే యంగ్ యమ ఎన్టీఆర్ సరసన జాక్ పాట్ పట్టేసిందంటూ పొగిడేస్తున్నారు.

జాన్వీ బాలీవుడ్ నుంచి టాలీవుడ్ లో అడుగుపెట్టే క్రమంలో ఫోటోషూట్ల పరంగా మరింత దూకుడు పెంచింది. ఓవైపు హాట్ కంటెంట్ ని తనదైన శైలిలో ప్రెజెంట్ చేస్తూనే ట్రెడిషనల్ అవతార్ లో కనిపించేందుకు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇటీవల సౌత్ అభిమానులను దృష్టిలో ఉంచుకుని ఫోటోషూట్ల తీరుతెన్నులను మార్చేయడం గమనార్హం. కొద్ది కాలంగా జాన్వీ కపూర్ వరుస ఫోటోషూట్లు అంతర్జాలంలో సునామీని సృష్టిస్తున్నాయి. తాజాగా ఈ బ్యూటీ బంగారు తళుకుల ఫ్రాకులో ఎంతో అందంగా కనిపిస్తోంది. లేటెస్ట్ డిజైనర్ థై స్లిట్ ఫ్రాక్ లో జాన్వీ మునుపటి కంటే హాట్ గా కనిపిస్తోందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. ముఖ్యంగా తారక్ అభిమానులు జాన్వీ కపూర్ ఫోటోలను వైరల్ గా షేర్ చేస్తూ యువరాణి అంటూ తమ ప్రేమను కురిపిస్తున్నారు. ఆర్.ఆర్.ఆర్ లాంటి పాన్ ఇండియా హిట్ అందుకున్న తర్వాత యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన అవకాశం దక్కించుకున్న జాన్వీ నిజంగా అదృష్టవంతురాలు అంటూ కీర్తించేస్తున్నారు. బంగారు వర్ణం లాంగ్ ఫ్రాక్ లో జాన్వీ తళుకుబెళుకులు గుండెల్ని గుల్ల చేస్తున్నాయంటూ ఒక సెక్షన్ ఫ్యాన్స్ ప్రేమలో పడిపోయారు. ఓవరాల్ గా జాన్వీ గోల్డెన్ లుక్ ఫ్యాన్స్ గుండెల్లో బలమైన ముద్ర వేసిందనడంలో సందేహం లేదు. యంగ్ టైగర్ ఎన్టీఆర్ తన కెరీర్ 30వ సినిమాతో ల్యాండ్ మార్క్ హిట్ అందుకోవాలని తపిస్తున్నాడు. కొరటాల శివ దర్శకుడు కావడంతో ఈ మూవీ కోసం పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతున్నాడు. ఇలాంటి క్రేజీ ప్రాజెక్ట్ లో జాన్వీ కథానాయికగా అవకాశం అందుకుంది. ఈ సినిమాతో జాన్వీ పేరు దేశ విదేశాల్లో మార్మోగడం ఖాయమని విశ్లేషిస్తున్నారు. సరైన టైమ్ లో సరైన ప్రాజెక్ట్ తో జాన్వీ సౌత్ లో అడుగుపెడుతుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. జాన్వీ ఇటీవల ఎన్టీఆర్ 30 లాంచ్ ఈవెంట్ లో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సరసన నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని... టీమ్ సృష్టిస్తున్న ప్రపంచం ప్రేక్షకులను చాలా ఎగ్జయిట్ చేస్తుందని కితాబిచ్చింది. ఇటీవలే RRR సినిమాని మళ్లీ చూశానని అపారమైన చరిష్మా ఉన్న ఎన్టీఆర్ తో కలిసి నటించడం గొప్ప అవకాశమని దీనిని సద్వినియోగం చేసుకుంటానని జాన్వీ పేర్కొంది.

# దసరా ధమాకాలు..దీపావళి పటాకాలు







టాలీవుడ్ లో స్టార్ హీరోలకి సంబందించిన సినిమాలు ఎక్కువగా ఫెస్టివల్ టైమ్ లో రిలీజ్ అవుతూ ఉంటాయి. ఆ సీజన్ ని హీరోలు కరెక్ట్ గా వాడుకొని థియేటర్స్ లోకి వచ్చేందుకు ఇష్టపడతారు. అలాగే ఈ ఏడాది దసరా సీజన్ నెక్స్ట్ టాలీవుడ్ లో సినిమాలకి పండగ. ఈ దసరా సందర్భంగా సెప్టెంబర్ లో నందమూరి బాలకృష్ణ భగవంత్ కేసరి మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. అలాగే రవితేజ ఫస్ట్ పాన్ ఇండియా మూవీ టైగర్ నాగేశ్వరరావు కూడా దసరాకి ప్రేక్షకుల ముందుకి రా రాబోతోంది. ఈ రెండు చిత్రాల రిలీజ్ డేట్స్ ఇప్పటికే కన్ఫర్మ్ అయ్యాయి. అలాగే రామ్ పోతినేని బోయపాటి శ్రీను కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా మూవీ కూడా దసరాకి రిలీజ్ అవ్వబోతోంది. ఈ మూడు సినిమాలపై భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. వీటిలో దేనికవే ప్రత్యేకం కావడం విశేషం. వీటికి తోడుగా లోకేష్ కనగరాజ్ ఇళయదళపతి విజయ్ లియో మూవీ కూడా విజయదసమికి రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో ప్రేక్షకులకి మాత్రం కావాల్సినంత వినోదం దసరా సీజన్ లో దొరుకుతోంది. అలాగే దీపావళికి సినిమాల రిలీజ్ విషయంలో గట్టిపోటీనే ఉంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఓజీ మూవీ దీపావళి నాడు రిలీజ్ అవుతుందని టాక్ వినిపిస్తోంది. అలాగే కార్తి జపాన్ మూవీ శంకర్ కమల్ హాసన్ ఇండియన్ 2 చిత్రాలు కూడా దీపావళి నాడు ప్రేక్షకులని అలరించే ఛాన్స్ ఉందని టాక్. మొత్తానికి రాబోయే రెండు పెద్ద పండుగలకి కూడా టాలీవుడ్ లో థియేటర్స్ హౌస్ ఫుల్ కావడానికి కావాల్సినంత స్టఫ్ ఉన్న చిత్రాలు రిలీజ్ కాబోతున్నాయి. ఇక వీటిలో దసరా రిలీజ్ లో భగవంత్ కేసరి జోరు ఉంటుంది. కాబట్టి దానికి పోటీగా రాబోయే రామ్ పాన్ ఇండియా టైగర్ నాగేశ్వరరావులలో ఒకటి వెనక్కి వెళ్ళే ఛాన్స్ ఉందనే ప్రచారం నడుస్తోంది. ఒక వేళ వెనక్కి వెళ్ళకపోతే మాత్రం నాలుగు పెద్ద సినిమాలు ఒకేసారి రిలీజ్ అయితే థియేటర్స్ దొరికే ఛాన్స్ తక్కువగా ఉంటుంది. వీటిలో రామ్ పోతినేని తమిళ్ లియో సినిమాలపై ఎఫెక్ట్ పడొచ్చని ఇండస్ట్రీ వర్గాలలో వినిపిస్తోన్న మాట.

# కియరా రెడ్ హాట్ కిల్లర్ లుక్

టాలీవుడ్ బాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా ఓ వెలుగు వెలుగుతోంది కియరా అద్వాణీ. ఇప్పుడు ఆస్కార్ విన్నింగ్ ఆర్.ఆర్.ఆర్ నటుడు.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'గేమ్ ఛేంజర్'(ఆర్.సి 15) లోను నటిస్తోంది. ఈ సినిమాతో కియరా పాన్ ఇండియా స్టార్ డమ్ ని అందుకోనుంది. తనకు తానుగానే గేమ్ ఛేంజర్ గా దూసుకుపోయేందుకు ఇంకెంతో సమయం లేదని అభిమానులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే అసాధారణ స్టార్ డమ్ ని ఆస్వాధిస్తూ నేటితరం నాయికల్లో క్రేజీ ఎర్నర్ గా గుర్తింపు తెచ్చుకున్న కియరా ఒక్కో సినిమాకి 3-4 కోట్లు వసూలు చేస్తోంది. హిందీ పరిశ్రమలో పారితోషికం పరంగా మరో మెట్టు పైనే ఉందని తెలిసింది. అలాగే సోషల్ మీడియా పోస్టింగులతోను నిరంతరం బజ్ క్రియేట్ చేస్తున్న కియరా ఈ వేదికలపైనా యాడ్ పోస్టింగులతో భారీగా ఆర్జిస్తోంది. మరోవైపు కియరా నిరంతరం కిల్లర్ హాట్ ఫోటోషూట్లతో కుర్రకారు మతులు చెడగొడుతోంది. తాజాగా కియరా రెడ్ హాట్ లుక్ ని షేర్ చేయగా అది అంతర్జాలంలో సునామీ స్పీడ్ తో దూసుకుపోతోంది. రెడ్ థై స్లిట్ మఖమల్ డిజైనర్ ఫ్రాకులో కియరా



టూ హాట్ గా కనిపిస్తోంది. నిజానికి థై స్లిట్ ఎలివేషన్ ఇదే తొలిసారి కాదు. కానీ ఈసారి సంథింగ్ స్పెషల్ గా టూహాట్ గా కియరా కనిపిస్తోందంటూ అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. ఈ ఫోటోలను జోరుగా వైరల్ చేస్తున్నారు. ఇక ఇటీవలే తన ప్రియుడు సిద్ధార్థ్ మల్హోత్రాని పెళ్లాడేసిన కియరా పెళ్లి తర్వాత జీవితం ఎలా ఉంది? అని ప్రశ్నించగా.. దానికి ఆసక్తికర సమాధానమిచ్చారు. సిద్ధార్థ్ మల్హోత్రా - కియారా అద్వానీ ఇటీవల ముంబైలో జరిగిన ఒక అవార్డుల కార్యక్రమంలో తమ చిత్రాలలో అత్యుత్తమ నటనకు ట్రోఫీని సొంతం చేసుకున్నారు. అనంతరం కియారా అద్వానీని ముంబై విమానాశ్రయంలో ఒక ఫోటోగ్రాఫర్ "మేడమ్ ఆప్ కీ మ్యారేజ్ లైఫ్ కైసీ హై?" అని అడిగారు. కియారా మొదట్లో హాయిగా ఉందనే ఎక్స్ ప్రెషన్ ఇచ్చింది. కెమెరా వైపు తన ముఖాన్ని తిప్పి గేట్ నుండి ప్రవేశించే ముందు "సబ్ సాహీ హై" అని చెప్పింది. షేర్షా-భూల్ భూలైయా 2-జుగ్ జగ్ జియో -గోవింద నామ్ మేరా లాంటి చిత్రాలలో తన నటనకు కియారా స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకోగా.. షేర్షాలో తన పాత్రకు సిద్ధార్థ్ ఉత్తమ నటుడి అవార్డును అందుకున్నాడు. ఈ జంట షేర్షా షూటింగ్ సమయంలో ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత పెళ్లి బంధంతో ఒకటయ్యారు. ఇప్పుడు మళ్లీ కెరీర్ పరంగా ఎవరికి వారు బిజీ అయిపోయారు. 2023 ఫిబ్రవరి 7 న జైసల్మేర్ - సూర్యగఢ్ ప్యాలెస్ లో వివాహం జరిగింది.

## ఉప్పెన పాప పేమెంట్స్ లో సడన్ ట్విస్ట్!

ఉప్పెన సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ కృతి శెట్టి. ఈ అమ్మడు మొదటి సినిమాతో సూపర్ హిట్ ని ఖాతాలో వేసుకుంది. అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేకుండా వరుస అవకాశాలు అందుకుంది. అలాగే ఉప్పెన తర్వాత శ్యామ్ సింగరాయ్ బంగార్రాజు సినిమాతో రెండు హిట్స్ ని సొంతం చేసుకుంది. దీంతో ఒక్కసారిగా అమ్మడు క్రేజ్ పెరిగిపోయింది. మాచర్ల నియోజకవర్గంలో నితిన్ కి జోడీగా అలాగే ది వారియర్ మూవీలో రామ్ పోతినేనితో జత కట్టింది. అలాగే ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి సినిమాలో డ్యూయల్ రోల్ లో నటించింది. ఈ మూవీ సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. దీంతో కృతి శెట్టిని యువ హీరోలు అందరూ పక్కన పెట్టారు. అదే సమయంలో శ్రీలీల చేతిలోకి వరుస



సినిమాలు వచ్చి చేరుతున్నాయి. ఓ వైపు స్టార్ హీరోలు మరో వైపు కుర్ర హీరోలతో జత కడుతూ శ్రీలీల దూసుకుపోతోంది. ప్రస్తుతం ఈ బ్యూటీ చేతిలో 8 సినిమాల వరకు ఉన్నాయి. ఇక కృతి శెట్టి చేతిలో అయితే తెలుగులో కస్టడీ మూవీ మాత్రమే ఉంది. అలాగే మలయాళంలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ లో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా మూవీలో కృతి శెట్టి నటిస్తోంది. తమిళంలో సూర్యకి జోడీగా ఒక మూవీ కమిట్ అయిన దాని నుంచి ఈ బ్యూటీని తప్పించారని టాక్. ఈ నేపథ్యంలో చేతిలో ఆశించిన స్థాయిలో అవకాశాలు లేకపోవడంతో మరల రెమ్యునరేషన్ ని తగ్గించుకున్నట్లు సోషల్ మీడియాలో టాక్. ప్రస్తుతం ఈ బ్యూటీ 50 లక్షల వరకు ఒక్కో సినిమాకి రెమ్యునరేషన్ తీసుకుంటుంది. దీనికి 30 లక్షలకి తగ్గించినట్లు ప్రచారం నడుస్తోంది. రెమ్యునరేషన్ తగ్గిస్తే అవకాశాలు వస్తాయని ఆమె ఈ నిర్ణయం తీసుకుందని టాక్. మరి ఇందులో వాస్తవం ఎంత అనేది కృతి శెట్టి నుంచి క్లారిటీ వస్తేనే తెలిసే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే కృతి శెట్టి నటించిన కస్టడీ మూవీ వచ్చే నెల రిలీజ్ కానున్న నేపథ్యంలో ఆ సినిమా హిట్ అయితే ఈమె ఫేట్ మారొచ్చని అంచనా వేస్తున్నారు.




హైదరాబాద్: తెలంగాణలో అధికార భారత్ రాష్ట్ర సమితి (భారాస) శాసనసభ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. రాష్ట్రంలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థుల మొదటి జాబితాను భారాస అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం ప్రకటించారు. పంచమి తిథి కావడంతో ఇదే శుభముహూర్తంగా అభ్యర్థుల వివరాలను వెల్లడించారు. అభ్యర్థుల్లో పెద్దగా మార్పులు చేర్పులూ చేయలేదని, కేవలం ఏడు స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను మార్పు చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. నర్సాపూర్, నాంపల్లి, జనగామ, గోషామహల్ స్థానాలకు భారాస అభ్యర్థులను ప్రస్తుతానికి వెల్లడించలేదు. ఉప్పల్, బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్, వైరా, వేములవాడ సిట్టింగ్ అభ్యర్థులను మార్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి, గజ్వేల్ నుంచి బరిలోకి దిగనున్నారు.

1.సిర్పూర్ - కోనేరు కోనప్ప 2. చెన్నూరు (ఎస్సీ)- బాల్క సుమన్ 3.బెల్లంపల్లి (ఎస్సీ)- దుర్గం చిన్నయ్య 4.మంచిర్యాల్ - నడిపెల్లి దివాకర్ రావు 5. అసిఫాబాద్ (ఎస్టీ) - కోవా లక్ష్మీ 6. ఖానాపూర్ (ఎస్టీ) - భూక్యా జాన్సన్ రాథోడ్‌నాయక్ 7.ఆదిలాబాద్ - జోగు రామన్న8.బోథ్ (ఎస్టీ) - అనిల్ జాదవ్ 9.నిర్మల్ - అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి 10.ముథోల్ - విఠల్ రెడ్డి 11.ఆర్మూర్ - ఆశన్నగారి జీవన్ రెడ్డి 12.బోధన్ - మహమ్మద్ షకీల్ ఆమిర్ 13.జుక్కల్ (ఎస్సీ) - హన్మంత్ శిందే 14.బాన్స్‌వాడ - పోచారం శ్రీనివాస్ రెడ్డి 15.యల్లారెడ్డి- జాజుల సురేందర్ 16.కామారెడ్డి - కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్) 17.నిజామాబాద్ అర్బన్ - బిగాల గణేశ్ గుప్తా 18.నిజామాబాద్ రూరల్ - గోవర్దన్ బాజిరెడ్డి 19.బాల్కొండ - వేముల ప్రశాంత్ రెడ్డి 20.కోరుట్ల - డా. సంజయ్ కల్వకుంట్ల 21.జగిత్యాల్ - డా సంజయ్ కుమార్ 22.ధర్మపురి (ఎస్సీ) - కొప్పుల ఈశ్వర్ 23.రామగుండం - కోరుకంటి చందర్ 24.మంథని - పుట్టా మధు 25.పెద్దపల్లి - దాసరి మనోహర్‌రెడ్డి 26.కరీంనగర్ - గంగుల కమలాకర్ 27.చొప్పదండి (ఎస్సీ)- సుంకె రవిశంకర్ 28.వేములవాడ -చల్మెడ లక్ష్మీనరసింహారావు 29.సిరిసిల్ల - కేటీఆర్ 30.మానకొండూరు (ఎస్సీ) - రసమయి బాలకిషన్ 31.హుజూరాబాద్ - పాడి కౌశిక్ రెడ్డి 32.హుస్నాబాద్ - సతీశ్ కుమార్ 33.సిద్దిపేట - హరీశ్‌రావు 34.మెదక్ - పద్మా దేవేందర్‌రెడ్డి 35.నారాయణఖేడ్ - మహారెడ్డి భూపాల్ రెడ్డి 36.అంథోల్ (ఎస్సీ) - చంటి క్రాంతి కిరణ్ 37.నర్సాపూర్ - (అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది) 38.జహీరాబాద్ (ఎస్సీ) - కె.మాణిక్ రావు 39.సంగారెడ్డి - చింతా ప్రభాకర్ 40.పటాన్‌చెరు - గూడెం మహిపాల్‌రెడ్డి 41.దుబ్బాక- కొత్త ప్రభాకర్ రెడ్డి 42.గజ్వేల్- కేసీఆర్ 43.మేడ్చల్- చామకూర మల్లారెడ్డి 44.మల్కాజ్‌గిరి- మైనంపల్లి హనుమంతరావు 45. కుత్బుల్లాపూర్- వివేకానంద 46. కూకట్‌పల్లి-మాధవరం కృష్ణారావు 47.ఉప్పల్ -బండారు లక్ష్మారెడ్డి 48.ఇబ్రహీంపట్నం - మంచిరెడ్డి కిషన్ రెడ్డి 49.ఎల్బీనగర్ - దేవిరెడ్డి సుధీర్ రెడ్డి 50.మహేశ్వరం - సబితా ఇంద్రారెడ్డి 51.రాజేంద్రనగర్ - ప్రకాశ్ గౌడ్ 52.శేరిలింగంపల్లి - అరికెపూడి గాంధీ 53.చేవెళ్ల (ఎస్సీ)- కాలే యాదయ్య 54.పరిగి - కొప్పుల మహేశ్ రెడ్డి 55.వికారాబాద్ (ఎస్సీ)- డా. మెతుకు ఆనంద్ 56.తాండూరు - పైలట్ రోహిత్ రెడ్డి 57.ముషీరాబాద్ - ముఠా గోపాల్ 58.మలక్‌పేట - తీగల అజిత్ రెడ్డి 59.అంబర్‌పేట్ - కాలేరు వెంకటేశ్ 60.ఖైరతాబాద్ - దానం నాగేందర్ 61.జూబ్లీహిల్స్ - మాగంటి గోపీనాథ్ 62.సనత్‌నగర్ - తలసాని శ్రీనివాస్ యాదవ్ 63. నాంపల్లి -(అభ్యర్థి పేరు ప్రకటించాల్సి ఉంది) 64. కార్వాన్ - ఐందల కృష్ణయ్య 65.గోషామహల్- (అభ్యర్థి పేరు ప్రకటించాల్సి ఉంది) 66. చార్మినార్ - ఇబ్రహీం లోడి 67.చాంద్రాయణ గుట్ట- ఎం సీతారామ్ రెడ్డి 68. యాకుత్ పుర- సామ సుందర్ రెడ్డి 69. బహదూర్‌పుర- అలీ బక్రీ 70. సికింద్రాబాద్ - టి పద్మారావు 71. సికింద్రాబాద్ కంటోన్మెంట్ (ఎస్సీ)- లాస్య నందిత 72. కొడంగల్- పట్నం నరేందర్ రెడ్డి 73. నారాయణపేట్- రాజేందర్ రెడ్డి 74. మహబూబ్‌నగర్ - శ్రీనివాస గౌడ్ విరుసనోళ్ల 75. జడ్చర్ల - చర్లకోల లక్ష్మారెడ్డి 76. దేవరకద్ర- ఆళ్ల వెంకటేశ్వరరెడ్డి 77. మక్తల్- చిట్టెం రామ్ మోహన్ రెడ్డి 78. వనపర్తి- సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి 79. గద్వాల్- బండ్ల కృష్ణమోహన్ రెడ్డి 80. అలంపూర్ (ఎస్సీ)- వీఎం అబ్రహం 81. నాగర్‌కర్నూల్- మర్రి జనార్దన్ రెడ్డి 82. అచ్చంపేట (ఎస్సీ)- గువ్వల బాలరాజు 83. కల్వకుర్తి- గుర్క జయపాల్ యాదవ్ 84. షాద్‌నగర్ - అంజయ్య ఎల్లనమోనీ 85. కొల్లాపూర్- బీరం హర్షవర్దన్ రెడ్డి 86. దేవరకొండ (ఎస్టీ)- రవీంద్ర కుమార్ రమావత్ 87. నాగార్జున సాగర్- నోముల భగత్ 88. మిర్యాలగూడ- నల్లమోతు భాస్కర రావు 89. హుజూర్ నగర్- శానంపూడి సైదిరెడ్డి 90. కోదాడ- బొల్లం మల్లయ్య యాదవ్ 91. సూర్యపేట- జగదీశ్ రెడ్డి 92. నల్గొండ- కంచర్ల భూపాల్ రెడ్డి 93. మునుగోడు- కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి 94. భువనగిరి - పైళ్ల శేఖర్‌రెడ్డి 95. నకిరేకల్ (ఎస్సీ) - చిరుమర్తి లింగయ్య 96. తుంగతుర్తి (ఎస్సీ)- గాదరి కిషోర్ కుమార్ 97. ఆలేరు - గొంగిడి సునీత 98 .జనగామ - (అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది) 99.స్టేషన్ ఘన్‌పూర్ (ఎస్సీ) - కడియం శ్రీహరి 100. పాలకుర్తి - ఎర్రబెల్లి దయాకర్ రావు 101. డోర్నకల్ - డీఎస్ రెడ్యా నాయక్ 102. మహబూబాబాద్ (ఎస్టీ) - బానోతు శంకర్ నాయక్ 103. నర్సంపేట - పెద్ది సుదర్శన్ రెడ్డి 104 .పరకాల - చల్లా ధర్మా రెడ్డి 105.వరంగల్ వెస్ట్ - దాస్యం వినయ్ భాస్కర్ 106 .వరంగల్ ఈస్ట్ - నన్నపునేని నరేందర్ 107. వర్ధన్నపేట (ఎస్సీ) - ఆరూరి రమేశ్ 108. భూపాలపల్లి - గండ్ర వెంకటరమణారెడ్డి 109. ములుగు (ఎస్టీ) - బడే నాగజ్యోతి 110. పినపాక (ఎస్టీ) - రేగా కాంతారావు 111. ఇల్లందు (ఎస్టీ) - బానోతు హరిప్రియ నాయక్ 112. ఖమ్మం - పువ్వాడ అజయ్ కుమార్ 113. పాలేరు - కందాల ఉపేందర్ రెడ్డి 114. మధిర (ఎస్సీ) - లింగాల కమల్ రాజు 115. వైరా (ఎస్టీ) - బానోతు మదన్‌లాల్ 116. సత్తుపల్లి (ఎస్సీ) - సండ్ర వెంకట వీరయ్య 117. కొత్తగూడెం - వనమా వెంకటేశ్వర రావు 118. అశ్వారావుపేట (ఎస్టీ) -మెచ్చా నాగేశ్వరరావు 119. భద్రాచలం (ఎస్టీ) - తెల్లం వెంకటరావు.



# అల్లుడి సత్తా చూపించినా మామకి మొండిచెయ్యి చూపించారు

కొన్ని రోజుల క్రితం నటుడు అల్లు అర్జున్ నల్గొండలో హడావిడి చేశారు. తన మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి కట్టించిన కంచర్ల కన్వెన్షన్ ప్లేస్ ఓపెనింగ్ కి హాజరయ్యాడు అల్లు అర్జున్. అతని అభిమానుల జన సందోహంతో నల్గొండ నిండిపోయింది. దారిపొడవునా, అల్లు అర్జున్ కట్ ఔట్స్, అలాగే బీఆర్ఎస్ నాయకుల కట్ ఔట్స్ విపరీతంగా కనిపించాయి. ఆరోజు అల్లు అర్జున్ సందడే సందడి అక్కడ. అంతమంది అభిమానులు వచ్చారు. అదే సమావేశంలో అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి తనకి నాగార్జున సాగర్ నుండి ముఖ్యమంత్రి కెసిఆర్ పోటీ చెయ్యమంటే తప్పకుండా చేస్తాను అని అన్నారు. లేదా వేరే దగ్గర టికెట్ ఇచ్చినా పోటీ చేస్తాను అని చెప్పారు. అతను టికెట్ ఆశిస్తున్న వారిలో వున్నారు అని అర్థం అయింది. అందుకే ముఖ్యమంత్రి లిస్ట్ ప్రకటించక ముందే తన కన్వెన్షన్ ప్లేస్ ని అల్లుడు అల్లు అర్జున్ చేత ఓపెన్ చేయించి తన వెనకాల తన అల్లుడు, అతని అభిమానులు వున్నారు అని పరోక్షంగా చెప్పకనే చెప్పారు చంద్రశేఖర్ రెడ్డి. అయితే ఈరోజు ముఖ్యమంత్రి కెసిఆర్ బీఆర్ఎస్ పార్టీ లిస్ట్ ప్రకటించారు. అందులో ఎక్కడా అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి పేరు లేదు. అయితే నాగార్జున సాగర్ నుండి ఇస్తే పోటీ చేస్తాను అని చెప్పిన చంద్రశేఖర్ రెడ్డి కి అక్కడ కూడా చుక్కెదురైంది. అక్కడ నోముల భగత్ పేరు వచ్చింది. అల్లు అర్జున్ మామకి ఈసారి పార్టీ తరపున పోటీ చేసే అవకాశం లేనట్టే అనిపిస్తోంది. మరి ఇప్పుడు అల్లు అర్జున్ మామ ఏమి చేస్తారో, తన తదుపరి ఎత్తు ఏమిటో, ఎటువంటి ఆలోచన చేస్తారో చూడాలి మరి.

# కామారెడ్డి, గజ్వేల్.. రెండు చోట్ల పోటీ.. ఎందుకో చెప్పిన గులాబీ బాస్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అసెంబ్లీ ఎన్నికల్లో రెండు చోట్ల నుంచి అసెంబ్లీకి పోటీ చేయనున్నారు. సిట్టింగ్ నియోజకవర్గం గజ్వేల్‌తో పాటు కామారెడ్డి నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. అయితే ఈ నిర్ణయం వెనుక కారణం గురించి మీడియా ఆయన్ని ప్రశ్నించగా.. తనదైన స్టైల్‌లో స్పందించారాయన. పార్టీ నిర్ణయించింది కాబట్టే తాను రెండు చోట్ల నుంచి పోటీ చేస్తున్నట్లు తెలిపారాయన. "కేసీఆర్ చరిత్ర మీకు తెల్వదు. కరీంనగర్, రివర్స్‌ల మహబూబ్ నగర్ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచా. కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్, నిజామాబాద్ జిల్లా నుంచి మంత్రి నన్ను వ్యక్తిగతంగా కోరారు. వాళ్లే కాదు.. ఇంకొన్ని జిల్లాల వాళ్లు కూడా అడిగారు. చివరగా పార్టీ సంప్రదింపులతో కామారెడ్డి ఫిక్స్ అయ్యాం. అంతేగానీ.. ఇందులో ఏం ప్రత్యేకత లేదు అని తెలిపారాయన.

# డిసెంబర్‌లోనే ఎన్నికలు.. అంతా సిద్ధం కావాలి



హైదరాబాద్: డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని.. ఎన్నికలు సిద్ధం కావాలని బీజేపీ అనుబంధ మోర్చాలకు ఆ పార్టీ ఎంపీ లక్ష్మణ్ సూచించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు. ఎన్నికలను బీజేపీ అనుబంధ మోర్చాలు సవాల్‌గా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యత మోర్చాలదే అని చెప్పుకొచ్చారు. బీజేపీని అన్ని వర్గాలకు చేరువ చేయాలన్నారు. అభివృద్ధి సంక్షేమంతో మోదీ నాయకత్వంలో దేశం దూసుకెళ్తోందని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ హయాంలో తెలంగాణకు ద్రోహం జరిగిందని వ్యాఖ్యలు చేశారు. ప్రజా సమస్యలపై మోర్చాల కార్యకర్తలు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 23న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. 24న మంత్రులు ఘెరావ్ చేయాలని, ప్రజా సమస్యలపై ఈనెల 25న బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్లను ముట్టడించాలని పిలుపునిచ్చారు. ఉద్యమం ద్వారానే నయా నిజాం కేసీఆర్ మెడలు వంచుతామని లక్ష్మణ్ పేర్కొన్నారు.

# టికెట్ కోల్పోయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వీళ్లే..



హైదరాబాద్: ఎంతో ఉత్కంఠభరితంగా ఎదురుచూసిన బీఆర్ఎస్ అభ్యర్థుల మొదటి జాబితా విడుదలైంది. ఏకంగా 115 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించి సీఎం కేసీఆర్ ఆశ్చర్యపరిచారు. కేవలం 4 స్థానాల్లో అభ్యర్థులను మాత్రమే పెండింగ్‌లో పెట్టారు. చెప్పినట్టుగా పెద్దగా మార్పులు లేకుండా సిట్టింగులకే ప్రాధాన్యత ఇచ్చారు. అయితే కేవలం 8 మంది మాత్రమే జాబితాలో చోటు కోల్పోయారు.

**టికెట్ దక్కని BRSఎమ్మెల్యేలు వీళ్లే..** 1. సుభాష్ రెడ్డి - ఉప్పల్ 2. రాజయ్య - స్టేషన్ ఘన్‌పూర్ 3. రాములు నాయక్ - వైరా 4. రేఖా నాయక్ - ఖానాపూర్ 5. చెన్నమనేని రమేష్ - వేములవాడ 6. గంప గోవర్ధన్ - కామారెడ్డి 7. రాథోడ్ బాపురావు - బోథ్ 8. విద్యాసాగర్ రావు - కోరుట్ల( అభ్యర్థిగా కుమారుడు).

**ఇంకా ప్రకటించని నియోజకవర్గాలు ఇవే..** 1. జనగాం 2. నర్సాపూర్ 3. నాంపల్లి 4. గోషామహల్.

# దమ్మున్న ముఖ్యమంత్రి ధైర్యంగల్ల ప్రకటన..

## ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలి : ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను.. ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేశారు. తెలంగాణకు ఇది ఉత్సాహకరమైన సమయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసిఆర్ 119 స్థానాలకు గాను 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. సీఎం కేసీఆర్ ధైర్యవంతమైన నాయకత్వంపై, ప్రభావశీలమైన బీఆర్ఎస్ ప్రభుత్వ పరిపాలనపై ప్రజలు అచంచలమైన విశ్వాసాన్ని ప్రదర్శిస్తారన్న నమ్మకముందన్నారు. ఈ సందర్భంగా పని చేసే ప్రభుత్వాన్ని గుర్తించి మరోసారి తెలంగాణ ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ కోరారు. కాగా, 2023 అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ సోమవారం తెలంగాణ భవన్‌లో ప్రకటించారు. ఏడు చోట్ల తప్ప మిగతా నియోజకవర్గాల్లో సిట్టింగ్ అభ్యర్థులకే ఛాన్స్ ఇచ్చినట్లు కేసీఆర్ ప్రకటించారు. గజ్వేల్, కామారెడ్డి స్థానాల్లో తాను పోటీ చేయనున్నట్లు సీఎం చెప్పారు. మంచి ముహూర్తం ఉండటంతో జాబితా ప్రకటించినట్లు తెలిపారు. కంటోన్మెంట్ సీటు సాయన్న కూతురు లాస్య నందితకు కేటాయించినట్లు వెల్లడించారు. కొన్ని కారణాలవల్ల ఏడుగురు సిట్టింగు అభ్యర్థులకు టికెట్ నిరాకరించినట్లు సీఎం చెప్పారు.

# టికెట్ రాకపోవడంతో ప్లాన్ మార్చిన తాటికొండ రాజయ్య..

## 2 పార్టీలపై చూపు!!.. బీజేపీ మాత్రం కాదు..!




స్టేషన్ ఘన్‌పూర్: అంతా అనుకున్నదే జరిగింది.. మొదటి నుంచి జరిగిన ప్రచారమే నిజమైంది.. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్ ఆశించిన సిట్టింగ్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు చుక్కెదురైంది. ఈ స్థానంలో మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని బరిలోకి దింపాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు ఆయన అభ్యర్థుల మొదటి జాబితాలో కడియం పేరును ప్రకటించారు. దీంతో ఏ దేవుడి దయతోనైనా చివరి నిమిషంలో టికెట్ దక్కుతుందని ఎదురుచూసిన రాజయ్యతోపాటు ఆయన అనుచరులకు భంగపాటు తప్పలేదు. దీంతో తీవ్ర నిరాశకు లోనైన తాటికొండ రాజయ్య భవిష్యత్ కార్యచరణపై దృష్టిపెట్టబోతున్నారని తెలుస్తోంది. ఇందుకోసం ఇప్పటికే రంగంలోకి దిగారని సమాచారం. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు చేస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ లేదా బీఎస్పీలో చేరాలంటున్నట్టు రాజయ్య వర్గీయులు చెబుతున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజయ్య మంతనాలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ఇదిలావుండగా జానకీపురం సర్పంచ్ నవ్య లైంగిక ఆరోపణల వ్యవహారం తాటికొండ రాజయ్య ఇమేజ్‌ని బాగా దెబ్బతీసింది. నవ్య ఎపిసోడ్ రచ్చకెక్కడం, మీడియా, సోషల్ మీడియాలో ప్రచారంతో ఈ వ్యవహారం అధిష్ఠానం దృష్టికెళ్లింది. ఇదే సమయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించిన కడియం శ్రీహరి ఈసారి స్టేషన్‌పూర్ టికెట్ ఇస్తే గెలిపించి చూపిస్తానని హామీ ఇవ్వడంతో బీఆర్ఎస్ అధిష్టానం కడియం వైపే మొగ్గుచూపింది. బీఆర్ఎస్ మొదటి జాబితాలో కడియం శ్రీహరి పేరు రావడమే ఇందుకు నిదర్శనం.

# కేసీఆర్ ఆశీర్వాదంతో పాఠశాలల రూపురేఖలు మారాయి



కామారెడ్డి: సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. పెద్ద కొడపగల్ మండల కేంద్రంలో మంత్రి మాట్లాడారు. "టాలెంట్ ఎవరి సొత్తు కాదు. విద్యార్థులు బాగా చదువుకుని గొప్పగా ఎదగాలి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేజీ టూ పీజీ వరకు విద్యను అందిస్తుంది. 2014- 15లో రూ.9000 కోట్ల బడ్జెట్ విద్యా వ్యవస్థకు కేటాయిస్తే ఇప్పుడది రూ.29000 కోట్లకు పెరిగింది. రాష్ట్రంలో 1571 గురుకులాలను అప్ గ్రేడ్ చేశాం. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా 2600 స్కూళ్లను రూ.7000 కోట్లతో అభివృద్ధి చేసుకుంటున్నాం. రూ.190 కోట్ల వ్యయంతో విద్యార్థులకు నాణ్యమైన పాఠ్యపుస్తకాల పంపిణీ చేశాం. రూ.100 కోట్లతో నోట్ బుక్‌లు, వర్క్‌షీట్‌ల పంపిణీ. స్కూళ్లను బాగు చేసుకున్నాం. ఆ స్కూళ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకోవాలి. పెద్ద కొడపగల్‌కు జూనియర్ కాలేజీ ప్రపోజల్ పంపుతాం. మరో మూడు అదనపు గదులకు, పాఠశాల గ్రౌండ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తాం. మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థులకు వారంలో మూడు రోజులు రాగి జావా బ్రేక్ ఫాస్ట్‌ను అందిస్తున్నాం. 6000 మంది విద్యార్థులకు విదేశాల్లో విద్యను అభ్యసించడానికి ఓవర్ సీస్ స్కాలర్ షిప్‌లు అందించాం." అని మంత్రి పేర్కొన్నారు.

# నకిలీ మద్యంపై ఉక్కుపాదం మోపడం వల్లే.. భారీగా ఆదాయం : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్ : తెలంగాణ రాష్ట్రానికి మద్యం విక్రయాల ద్వారా భారీగా ఆదాయం పెరిగిందని అందరూ భావిస్తున్నారని అయితే ఇదంతా నకిలీ, అనుమతి లేని మద్యంపై ఉక్కుపాదం మోపడం వల్లే ఇది సాధ్యమైందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సమైక్య రాష్ట్రంలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అమ్మకాలు, గుడుంబా, సొంత లేబిళ్ల ద్వారా తయారు చేసే నకిలీ మద్యం, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి వచ్చే మద్యం వల్ల ఆదాయం కోల్పోయే పరిస్థితి ఉండేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వీటన్నిటినీ కట్టడి చేయడం వల్లే రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు అదనంగా ఆదాయం వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎక్సైజ్ టెండర్ల లక్కీ డ్రాకు ముందు అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించిన తర్వాత మంత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 2620 మద్యం దుకాణాలు ఉండగా..ప్రస్తుతం 2598 దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం 131490 మంది టెండర్లలో పాల్గొంటున్నారని అన్నారు. 22 దుకాణాలకు తక్కువ మొత్తంలో టెండర్లు దాఖలు కావడం వల్ల వాటికి ప్రస్తుతం టెండర్లు నిర్వహించడం లేదన్నారు. అత్యంత పారదర్శకమైన నూతన ఎక్సైజ్ పాలసీని తీసుకురావడం వల్ల ఎక్కడ కూడా మద్యం దుకాణాల కోసం సిండికేట్లు కాకుండా కఠినమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కలెక్టర్ల సమక్షంలో అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాల లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ దుకాణానికైనా టెండర్ వేసేందుకు హైదరాబాద్ లో ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. గెలుపొందిన వారికి వెంటనే అలాట్మెంట్ ఆర్డర్లు కూడా అక్కడే అధికారులు అందిస్తారన్నారు. టెండర్ల ప్రక్రియలో చిన్న పొరపాటు జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. నీరా పాలసీ తీసుకువచ్చి ఆరోగ్యకరమైన హెల్త్ డ్రింక్ అందిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు, కల్లు గీత వృత్తిపై ఆధారపడిన గౌడ్స్ కు మద్యం దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లు కల్పించిన మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణ అని మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలియజేశారు. సమైక్య రాష్ట్రంలో మద్యం మీద వచ్చే ఆదాయం అక్రమ మద్యం వ్యాపారం చేసే వారి జేబుల్లోకి పోయేదని..నకిలీ మద్యాన్ని నిరోధించినందున ప్రస్తుతం ఆ ఆదాయం అంతా నేరుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతోందని మంత్రి తెలిపారు. సమైక్య పాలనలో కొందరు రాజకీయ నేతలు అక్రమ మద్యం వ్యాపారం చేసి కోట్లు గడించేవారని గుర్తుచేశారు.

# హరీష్‌రావు బట్టలూడతీసే వరకూ నిద్రపోను




తిరుమల : మంత్రి హరీష్ రావుపై ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఫైర్ అయ్యారు. హరీష్ రావు గతం గుర్తించుకోవాలన్నారు. తన నియోజకవర్గంని వదిలి తమ జిల్లాలో పెత్తనం చేస్తున్నాడని విమర్శించారు.

హరీష్ రావు బట్టలు ఊడదీసే వరకు నిద్రపోనన్నారు. అక్రమంగా రూ. లక్ష కోట్లు సంపాదించాడని మైనంపల్లి ఆరోపించారు. సిద్దిపేటలో హరీష్ రావు అడ్రస్ గల్లంతు చేస్తానన్నారు. రాజకీయంగా ఎంతో మందిని అణిచివేశాడన్నారు.

మెదక్‌లో తన తనయుడు.. మల్కాజ్‌గిరిలో తాను పోటీ చేస్తామని మైనంపల్లి తెలిపారు. మెదక్‌లో తన తనయుడుని కచ్చితంగా గెలిపించుకుంటానన్నారు. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని.. తనకు పార్టీ ఇప్పటికే టికెట్ ప్రకటించిందన్నారు. అయితే తన కుటుంబంలో ఇద్దరికీ టికెట్ ఇస్తేనే పోటీ చేస్తానని మైనంపల్లి హనుమంతరావు స్పష్టం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com